Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 201 మేడ్చల్ మల్కాజ్‌గిరి 11 ఆగస్టు 2023 శుక్రవారం పేజీలు : 4

### పిల్లల సంరక్షణ సెలవులు 730: కేంద్రం

న్యూఢిల్లీ : ప్రభుత్వ ఉద్యోగులైన మహిళలు, ఒంటరి పురుషులు పిల్లల సంరక్షణ నిమిత్తం తమ సర్వీసు కాలంలో గరిష్ఠంగా 730 రోజుల సెలవులు వినియోగించుకునేందుకు అర్హులని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. కేంద్ర పౌర సేవల (సెలవు) నిబంధనలు-1972లోని 43-సీ ప్రకారం ఉద్యోగులు ఈ సెలవులకు అర్హులని కేంద్ర సిబ్బంది వ్యవహారాల సహాయమంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 18 ఏళ్లలోపు వయసున్న ఇద్దరు పిల్లల సంరక్షణకే ఈ నిబంధన వర్తిస్తుందని తెలిపారు. అయితే, దివ్యాంగులైన పిల్లల విషయంలో ప్రభుత్వం వయోపరిమితిని విధించలేదు. కాగా, మహిళలకు 6 నెలలు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను ఇస్తున్నారు.

# అవిశ్వాసాలతో మాపై విశ్వాసాన్ని పెంచుతున్నారు

## విపక్షాలకు చురకలంటించిన ప్రధాని మోదీ




దిల్లీ: విపక్షాలు కేంద్రంపై పదేపదే అవిశ్వాసం పెట్టి అభాసుపాలవుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వారి అవిశ్వాస తీర్మానాల వల్ల ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం పెరుగుతోందని చురకలంటించారు. ప్రతిపక్షాలకు ఆ భగవంతుడే అవిశ్వాసం పెట్టమని చెప్పి ఉంటాడని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేంద్ర ప్రభుత్వంపై విపక్షాల కూటమి 'ఇండియా' ప్రవేశపెట్టిన అవిశ్వా స తీర్మానంపై లోక్‌సభలో వాడీవేడీ చర్చ జరుగుతోంది. గురువారం సాయంత్రం దీనిపై ప్రధానమంత్రి మోదీ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విపక్షం ప్రవేశపెట్టిన ఈ అవిశ్వాసం తమకు ఎప్పటికీ అదృష్టమేనని అన్నారు. "మేం మరోసారి అఖండ మెజార్టీతో అధికారంలోకి రావాలని విపక్షాలు నిర్ణయించాయి. అందుకే ఈ అవిశ్వాసం తీసుకొచ్చాయి" అని మోదీ అన్నారు. తమపై నమ్మకం ఉంచిన కోట్లాది భారతీయులకు కృతజ్ఞతలు మోదీ చెప్పారు. 2018లోనూ అవిశ్వాసం పెట్టారని గుర్తు చేస్తూ.. తమ ప్రభుత్వంపై ప్రజలు అనేకసార్లు విశ్వాసం చూపించారన్నారు. క్రికెట్ భాషలో చెప్పాలంటే విపక్షాలు వరుస నోబాల్స్ వేస్తుంటే.. అధికార పక్షం ఫోర్లు, సిక్సులు కొడుతోందని వ్యాఖ్యానించారు. ప్రజల ఆశీర్వాదంతో వచ్చే ఎన్నికల్లోనూ ఎన్డీయే ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. " అన్ని రికార్డులు బద్దలుకొట్టి ఎన్డీయే అధికారంలోకి వస్తుంది. ఇటీవల మా ప్రభుత్వం అనేక కీలక బిల్లులను సభలో ఆమోదించింది. వీటిపై విపక్షాలకు ఏమాత్రం ఆసక్తి లేదు.' దేశ ప్రజల పట్ల విపక్షాలు విశ్వాస ఘాతుకానికి ఒడిగట్టాయి. పేదల గురించి ఆలోచన లేదు. అధికారంలోకి రావడమే వారి పరమావధి. విపక్షాలు మాట్లాడిన ప్రతి మాట దేశమంతా శ్రద్ధగా వింటోంది. ఇప్పటి వరకు దేశాన్ని మీరు నిరాశ, నిస్పృహల్లో ముంచడం తప్ప.. చేసిందేమీ లేదు. విపక్ష నేతలు వాళ్లు తీసుకున్న గోతిలో వారే పడుతున్నారు. " అని మోదీ అన్నారు.

**అవిశ్వాసాలు పెట్టి ఏం సాధించారు? :** అవిశ్వాస తీర్మానాలు పెట్టి ఏం సాధించారని ప్రధాని మోదీ విపక్షాలను ప్రశ్నించారు. " 1999లో శరద్ పవార్ నాయత్వంలో, 2003, 2018లో సోనియా నేతృత్వంలో అవిశ్వాసం పెట్టారు. ఇన్నిసార్లు అవిశ్వాసాలతో వాళ్లు ఏం సాధించారు. 21వ శతాబ్దం భారత్‌దే. ఈ సమయం భారత్‌కు అత్యంత కీలకం. భారత్ స్వప్నాలు సాకారమయ్యే కీలక శతాబ్దమిది. 'అభివృద్ధి' మనందరి తారకమంత్రం కావాలి. విభేదాలు, వైరుధ్యాలు దాటి అభివృద్ధి మనందరి లక్ష్యం కావాలి. యువతరం స్వప్నాలు సాకారం చేసి లక్ష్య సిద్ధికి పరుగెడుతోంది. వారి లక్ష్యాలకు సంపూర్ణ సాకారం అందించాల్సిన బాధ్యత మనది. భాజపా అభివృద్ధి దృష్టిని గుర్తించి 2019లో మాకు ఈ దేశం సంపూర్ణ అధికారం ఇచ్చింది. తొమ్మిదేళ్లలో ఒక్క కుంభకోణం చూపించగలరా? సుపరిపాలన అన్నదానికి మేం నిదర్శనంగా నిలిచి గెలుస్తున్నాం. ఆకాశం అంచులు దాటి ఆలోచిస్తున్న యువతకు సంపూర్ణ సహకారం అందిస్తున్నాం. ప్రపంచ యవనికపై భారత్ పాత్ర కీలకంగా మారుతోంది. ప్రపంచ అభివృద్ధిలో భారత భాగస్వామ్యం రోజురోజుకూ పెరుగుతోంది. భారత్ ఆత్మవిశ్వాసం ప్రపంచానికి మార్గదర్శనంగా నిలుస్తోంది. భారత్ ఎంతో బలంగా ఉ ందనడానికి విదేశీ పెట్టుబడులే నిదర్శనం. పెట్టుబడులకు, అవకాశాలకు భారత్ స్వర్గంగా మారుతోంది. అని మోదీ అన్నారు.

**విపక్షాల కళ్లు మూసుకుపోయాయ్! :** భారత్‌లో నిరుపేదలు, అతిపేదలు లేరని ఐఎంఎఫ్ చెబుతోందని మోదీ లోక్‌సభకు తెలిపారు. 37 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ఐఎంఎఫ్ అధికారికంగా చెప్పిందన్నారు. మరోవైపు పరిశుభ్రత విషయంలో భారత్ కృషిని డబ్ల్యూహెచ్‌వో ప్రశంసించిదని చెప్పారు. " లక్షల మందిని అంటువ్యాధుల నుంచి రక్షించిన విషయాన్ని డబ్ల్యూహెచ్‌వో అధికారికంగా పేర్కొంది. భారత్‌లో జరుగుతున్న అభివృద్ధిని ప్రపంచమంతా చూస్తోంది. ఇక్కడున్న విపక్షాలకు మాత్రం అది కనిపించడం లేదు. విపక్షాల కళ్లు అహంకారంతో మూసుకుపోయాయి. ప్రజలు పేదరికం నుంచి బయటకు రావడం విపక్షాలు చూడలేవు. మూడు రోజులుగా విపక్షాలు వారి మనసులోని అక్కసంతా కక్కేశారు. అందువల్ల వారి మనసు కాస్త తేలికపడి ఉంటుంది. 'మోదీకి సమాధి కట్టేస్తున్నారు.. మోదీకి సమాధితవ్వుతున్నారంటూ' అపభ్రంశాలు పలుకుతున్నారు. అమంగళం, అపభ్రంశాలతో మోదీని ఆపలేరు. విపక్షాలకు ఎదుటి వాళ్ల నష్టం కోరుకునే వరం లభించినట్లుంది. మీరు ఎంత నష్టం కోరుకుంటే మాకు అంత లాభం జరుగుతోంది. గత 9 ఏళ్లలో ఇది పదేపదే నిరూపితమైంది." అని మోదీ తెలిపారు.

**వ్యవస్థల మీద విశ్వాసం లేదు :** ప్రతిపక్షాలకు ప్రజల మీద, దేశం మీద, వ్యవస్థల మీద విశ్వాసం లేదని మోదీ విమర్శించారు." ఒకసారి ప్రపంచంలో భారత ఆర్థిక వ్యవస్థ ఏ స్థాయికి ఎదుగుతుందో చూడండి. అతి త్వరలోనే ప్రపంచంలో భారత్ మూడో ఆర్థికశక్తిగా ఎదుగుతుంది.

మేం తప్పులు చేస్తున్నామంటున్నారు కదా.. విపక్షాలుగా మీరేం చేస్తున్నారు. మేము తప్పు చేస్తే.. సరైన దిశానిర్దేశం చేసే బాధ్యత విపక్షాలకు లేదా? మేం చేసే పనుల్లో తప్పులుంటే సూచనలు సలహాలు ఇచ్చే బాధ్యత మీకు లేదా? మేం ఏమీ చేయకుండానే భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందా? కాంగ్రెస్‌కు ప్రపంచాన్ని అర్థం చేసుకునే ఆలోచన లేదు.. అంత స్థాయి కూడా లేదు. ప్రతిదాన్ని విమర్శించడం తప్ప.. ఆర్థిక వ్యవస్థ పట్ల, దేశం పట్ల కాంగ్రెస్‌కు దిశదశ లేదు." అని మోదీ అన్నారు.

**అదే మా మంత్రం :** 1991లో భారత్.. అప్పుల కోసం ప్రపంచం వైపు చూసిందని మోదీ అన్నారు. 2014 తర్వాత స్థిరమైన ఆర్థిక వ్యవస్థగా నిలదొక్కుకుందన్నారు. " రిఫార్మ్, పెర్ఫామ్, ట్రాన్స్‌ఫామ్ అనే పద్ధతిలో దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాం. మా పనితీరు, నిబద్ధతతోనే దేశాన్ని మూడో ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టి తీరుతాం. డిజిటల్ ఇండియా గురించి మాట్లాడినప్పుడు, జన్‌ధన్ గురించి మాట్లాడినప్పుడు అవహేళన చేశారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ఏ స్థాయికి వెళ్లిందో మన కళ్లెదుటే కనబడుతోంది. విపక్షాలకు ఆత్మ విశ్వాసం ఉండదు. దేశీయులను నమ్మరు.

మన వ్యవస్థలకన్నా, మన సైన్యం కన్నా పాకిస్థాన్ చెప్పే మాటలపైనే విపక్షాలకు విశ్వాసం ఎక్కువ. భారత్‌పై వచ్చే వ్యతిరేక ప్రచారానికే ప్రతిపక్షాలు ఎక్కువ విలువిస్తాయి. భారత్ సామర్థ్యం మీద.. భారత ప్రజల సామర్థ్యం మీద విపక్షాలకు విశ్వాసం లేదు. అహకంకారంతో కాంగ్రెస్ కళ్లు మూసుకుపోయాయి. వాస్తవికతను జీర్ణించుకునే పరిస్థితుల్లో లేరు." అని మోదీ మండిపడ్డారు

## దేశంలో నెంబర్ వన్ లిక్కర్ స్టేట్ తెలంగాణ

హైదరాబాద్ : మెదక్ గడ్డ నుంచే యుద్ధం మొదలయిందని బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. గురువారం నాడు ఈటెల మీడియాతో మాట్లాడుతూ.."తెలంగాణ రాష్ట్రం గొప్పగా ఎదుగుతున్న రాష్ట్రం. మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ మా పై అసెంబ్లీలో దాడి చేశారు. 9 ఏళ్ల కాలంలో పన్నుల రూపంలో కట్టింది 20 లక్షల కోట్లు. 20 లక్షల కోట్లలో డబుల్ బెడ్రూం ఇళ్లకు ఇచ్చింది ఎంత.?ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 11వేల కోట్లు ఖర్చు చేసింది. అందులో హడ్కో సంస్థలో 8600 కోట్ల అప్పు తెచ్చింది. 1311 కోట్లు కేంద్రప్రభుత్వం ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం కేవలం 500 కోట్లు



ఇచ్చింది. శాసనసభలో డబుల్ బెడ్రూం ఇల్లు, నిరుద్యోగ భృతిపై చర్చ జరగాలి. గ్రామాల్లో చదువుకున్న యువకులకు పిల్ల దొరకడం లేదు. ప్రధాని మోదీ దేశ వ్యాప్తంగా 3.50 కోట్ల ఇళ్లు కట్టింద్రు. పక్క రాష్ట్రం 20 లక్షల ఇళ్లు కట్టింద్రు. గృహలక్ష్మికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలి. టీఆర్ఎస్ నేతలకు ఇవ్వొద్దు. దేశంలో నెంబర్ వన్ లిక్కర్ స్టేట్ తెలంగాణ. ఇప్పుడు 45 వేల కోట్లు లిక్కర్ ఆదాయం. తెలంగాణ సీఎం కేసీఆర్ భూములమ్మి రాష్ట్రాన్ని నడుపుతున్నారు. నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ హైకోర్టుకు రైతులు పోతే డబ్బులు ఇవ్వమని సుప్రీంకోర్టుకు పోయారు. పంటనష్టపోయిన రైతులకు పరిహారం ఎందుకు ఇవ్వలేదు. రైతుల పట్ల ప్రభుత్వానికి ప్రేమ లేదు. నోటిఫికేషన్లు ఇస్తే లీకేజీ చేస్తారు. 17 పేపర్లు లీకేజీ అయ్యాయి. చదువుకున్నోళ్లకు ఉద్యోగం రావడం లేదు.. పైరవీలకే ఉద్యోగాలు వస్తున్నాయి. టీఎస్పీఎస్సీ లో అన్ని అక్రమాలే" అని డిమాండ్ చేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులిచ్చినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తాం: నామా



దిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం ఒక్క పైసా కూడా ఇవ్వలేదని భారాస లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు లోక్‌సభలో వెల్లడించారు. కేంద్రం నిధులు ఇచ్చినట్లు నిరూపిస్తే భారాస ఎంపీలంతా రాజీనామా చేస్తామన్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చలో భాగంగా మాట్లాడిన నామా.. భాజపా ఎంపీలు అబద్ధం చెప్పారన్నారు. సభను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ఈ మేరకు భాజపా ఎంపీ నిషికాంత్ దూబేపై భారాస ఎంపీలు ప్రివిలేజ్ నోటీసు ఇచ్చారు. "తొమ్మిదేళ్లుగా తెలంగాణకు కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణలో ఉక్కు కర్మాగారం, కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం ఏర్పాటు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. పైగా మహారాష్ట్ర, గుజరాత్‌లలో కోచ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. ప్రగతిబాటలో పయనిస్తున్న తెలంగాణకు కేంద్రం ఇప్పటికైనా బాసటగా నిలిస్తే మరింత అభివృద్ధి చెందుతాం" అని అన్నారు. అయితే, నామా తప్పులు చెబుతున్నారంటూ భాజపా ఎంపీ నిషికాంత్ దూబె పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు భారత ప్రభుత్వం రూ. 86 వేల కోట్లు ఇచ్చిందన్నారు. ఈ క్రమంలో ఎంపీ నిషికాంత్‌పై నేడు భారాస ఎంపీలు ప్రివిలేజ్ నోటీసు ఇచ్చారు.

**కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వలేదు :** తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదని బీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం నాడు లోక్సభలో అవిశ్వాస తీర్మానంపై ఎంపీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె కాళేశ్వరం ప్రాజెక్టు కేంద్రం నిధులు ఇచ్చిందని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. "దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించాం. కాళేశ్వరంకు జాతీయ హోదా ఇవ్వాలని కోరాం. ప్రధాన మంత్రికి , కేంద్రానికి సీఎం కేసీఆర్ లేఖ రాశారు. వాట్సాప్, సోషల్ మీడియాలో అబద్ధాలు ప్రచారం చేసినట్టు, పార్లమెంట్లో కూడా అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు ప్రజల కోసం అడిగింది కూడా ఏమీ లేదు" అని లోక్ సభలో అవిశ్వాస తీర్మానంలో ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి కేంద్రంపై నిప్పులు చెరిగారు.




## ఎంపీ అరవింద్ పద్ధతిగా మాట్లాడడం నేర్చుకో

నిజామాబాద్: నిజామాబాద్‌లో బీజేపీ ఎంపీ అరవింద్ పాత్ర శూన్యమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. గురవారం నాడు మీడియాతో కవిత మాట్లాడుతూ.."అరవింద్ పద్ధతిగా మాట్లాడడం నేర్చుకో. అరవింద్ నోటికి అదుపు లేదు. దారుణంగా మాట్లాడుతున్నాడు. మీ పార్టీ ఆఫీస్‌లో పని చేసే వారి గురించి మాట్లాడటం లేదు. టికెట్టు ఇస్తానని సొంత పార్టీ నేతల దగ్గర డబ్బులు వసూలు చేస్తారు. వాళ్లను మోసం చేస్తారు అందుకే దాడి చేశారు. నేను



ఖచ్చితంగా నిజామాబాద్‌లో పోటీ చేస్తా. అరవింద్ కోరుట్లకు పోతానని చెప్పుకుంటున్నాడు. అరవింద ఎక్కడ పోటీ చేస్తే అక్కడ ఓడిస్తా. నాది నిజామాబాద్.. నా కట్టే కాలేది అక్కడే.. బండి సంజయ్ కరెంట్ తీగలు పట్టుకో...కరెంట్ వస్తుందో రాదో తెలుస్తుంది. తెలంగాణ హక్కుల కోసం బీజేపీ ఎంపీ బండి సంజయ్ పార్లమెంటులో ఒక్క మాట మాట్లాడలేదు. నిజామాబాద్‌లో కాంగ్రెస్ గెలుపు శూన్యం.. అన్ని మేమే గెలుస్తాం. నిజామాబాద్‌లో ఐటీ పరిశ్రమను తీసుకుని వచ్చాం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇన్ని నిధులు మంజూరు చేసిన ఘనత బీఆర్ఎస్‌దే" అని ఎమ్మెల్సీ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హైదరాబాద్ భవిష్యత్ కోసం భారీగా మెట్రో విస్తరణ : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : హైదరాబాద్ భవిష్యత్ కోసం భారీగా మెట్రో విస్తరణ చేపట్టాల్సి అవసరం ఉ ందని రాష్ట్ర ఐటీ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మెట్రో రైల్ మాస్టర్ ప్లాన్‌పై కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణంపై ప్రత్యేకంగా చర్చించారు. మెట్రో రైల్ భవన్‌లో నిర్వహించిన సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ భవిష్యత్ కోసం భారీగా మెట్రో విస్తరణ అవసరం అని పేర్కొన్నారు. నగరంలో రద్దీ, కాలుష్యం తగ్గాలంటే మెట్రోను విస్తరించక తప్పదన్నారు. విశ్వనగరంగా మారాలంటే ప్రజా రవాణా బలోపేతం కావాలన్నారు. మెట్రో విస్తరణకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు వేగంగా కార్యక్రమాలు చేయాలన్నారు. 48 ఎకరాల భూమిని మెట్రో డిపో కోసం అప్పగించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మరిన్ని కోచ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఫీడర్ సేవలను మెరుగుపరచడంతో పాటు ఫుట్‌పాత్‌లను అభివృద్ధి చేయాలన్నారు.

మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కాంప్లెక్స్‌ల కోసం ఇప్పటికే ఉ న్న, ప్రతిపాదిత మెట్రో స్టేషన్‌లకు సమీపంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని కేటీఆర్ ఆదేశించారు.

## దళిత బంధు జూటా : రఘునందన్ రావు



హైదరాబాద్ : దళిత బంధు జూటా అని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. గురువారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.." మెతుకుసీమ కేసీఆర్‌కు ఓనమాలు నేర్పింది.

డబుల్ బెడ్రూం ఇళ్లు లేవు.. గొర్రెలు లేవు. గరిబోణికి ఇళ్లు కట్టడం లేదు. మూడోసారి అధికారంలోకి వస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు న్యాయం జరగడం లేదు. 3 లక్షలతో ఇళ్లు అవుతదా. సీఎం కేసీఆర్ పుట్టిన మెదక్ గడ్డ నుంచే ఉద్యమిస్తాం. బీజేపీ బలమెంతో మెతుకుసీమ నుంచి చూపిస్తాం. పట్టపగలు సూటి కేసులతో దొరికితే ఎండేళ్లు ఎందుకు విచారణ చేయలేదు. బీజేపీ బీఆర్ఎస్ ఒక్కటి కాదు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే. పార్లమెంట్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని మాట్లాడుతున్నారు.

కేసీఆర్ అహంకారం దిగాలని దుబ్బాకలో నన్ను గెలి పించింద్రు. గ్రూప్ 2 విద్యార్థుల భవిష్యత్‌తో నాటకం ఆడారు" అని ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు.

గరుడ వార్త



## సంపాదకీయం

# మోడీ గురివింద నీతి!

నీతులు చెప్పటంలో బీజేపీ ముఖ్యంగా నరేంద్రమోడీ తర్వాతే ఇంకెవరైనా. అవినీతి, వారసత్వం, బుజ్జగింపులను దేశంనుండి తరిమేసే సమయం ఆసన్నమైందట. అవినీతి, వారసత్వాలకు క్విట్ ఇండియా అని చెప్పాల్సిన రోజు దగ్గరపడిందని మోడీ పిలుపిచ్చారు. అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం కష్టపడి పనిచేస్తుంటే దాన్ని చెడగొట్టడానికి ప్రతిపక్షాల్లో కొన్ని అదేపనిగా పెట్టుకున్నట్లు మోడీ విరుచుకుపడ్డారు. సానుకూల రాజకీయాలతో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వేగంగా ముందుకు దూసుకుపోతోందని మోడీ అన్నారు. మాటలు చెప్పటంలో మోడీ తర్వాతే ఇంకెవరైనా అని ఇప్పటికే చాలా సందర్భాల్లో నిరూపణైంది. మాటలు చెప్పినంతంగా మోడీ వ్యవహారం చేతల్లో కనిపించదు. అవినీతి అంటే డబ్బులు సంపాదించుకోవటం ఒకటే అని మోడీ అనుకున్నట్లున్నారు. అధికారంలో ఉన్న ప్రతిపక్షాలను కూలగొట్టడాన్ని ఏమంటారు ? కర్నాటక, మధ్యప్రదేశ్ లో బీజేపీ చేసిందాన్ని ఏమంటారో మోడీ చెబితే బాగుంటుంది. రాజస్థాన్ లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్లాన్ చేసి సాధ్యంకాక వదిలిపెట్టారు. ఇక వారసత్వం గురించి మాట్లాడుతున్న మోడీ బోర్డాఫ్ ఆఫ్ కంట్రోల్ క్రికెట్ ఇన్ ఇండియా(బీసీసీఐ) అధ్యక్షుడిగా అమిత్ షా కొడుకు జై షా ఎలాగయ్యారో చెప్పగలరా ? కేవలం అమిత్ షా కొడుకన్న ఏకైక వారసత్వంతోనే అధ్యక్షుడయ్యారు. ఇక కొందరు కేంద్ర మంత్రులు, రాష్ట్రాల మంత్రుల వారసులు ఫుల్లుగా ఎక్కడికక్కడ దోచుకునేస్తున్నారు. తమ నియోజకవర్గాల్లో ఇష్టారాజ్యంగా చేసుకుంటున్నారు. ఇవన్నీ సరిపోక లక్షల కోట్ల రూపాయల రానీబాకీలను రద్దుచేస్తున్నారు. ఈ బాకీలన్నీ పెద్దపెద్ద కార్పొరేట్లు తీసుకున్న వేలాది కోట్ల రూపాయల అప్పులే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇది కూడా అవినీతి కిందకే వస్తుంది. ప్రతిపక్షాల్లోని ప్రముఖనేతలపైకి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి లొంగదీసుకోవటం, ప్రతిపక్ష నేతలతో పాటు సమాజంలో ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేయటం కోసం పెగాసస్ అనే స్పైవేర్ వాడటం లాంటిది అధికార దుర్వినియోగం కిందకి వస్తుందని మోడీకి తెలీదా ? ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ను ఎంతరాచి రంపాన పెడుతున్నారో దేశమంతా చూస్తుందో. అప్రజాస్వామిక విధానాలకు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న మోడీ నీతులు మాట్లాడుండటమే ఆశ్చర్యంగా ఉంది.

# అధికారుల నిర్లక్ష్యం.. దళారులకు లాభం



వేములవాడ: ఒకప్పుడు పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలతో కళకళలాడిన వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డు నేడు వెలవెలబోతోంది. అధికారుల అలసత్వం, మార్కెట్ కమిటీ పాలక వర్గం నిర్లక్ష్యం కారణంగా ఎలాంటి కొనుగోళ్లు జరగక అలంకారప్రాయంగా మారింది. ఇదే అదనుగా గ్రామాల్లో దళారులు పత్తిని రైతుల వద్ద తక్కువ ధరకు సేకరించి భైంసా, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు చేపడితే వ్యాపారుల మధ్య పోటీ ఎక్కువై ధర పెరిగి రైతులకు గిట్టుబాటు అయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. మార్కెట్ కమిటీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో అన్నదాతలు నష్టపోతున్నారు. గ్రామాల్లో క్వింటాల్ పత్తికి రూ. 7,500 వరకు దళారులు చెల్లిస్తున్నారు. మరోవైపు కొందరు దళారులు తూకాల్లోనూ మోసాలకు పాల్పడుతూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. వాస్తవానికి వరంగల్, జమ్మికుంట, ఆదిలాబాద్ ప్రాంతాల్లో క్వింటాల్ పత్తికి రూ. 8,100 వరకు ధర పలుకుతున్నప్పటికీ గ్రామాల్లో మాత్రం దళారులు బాగా తక్కువ ధరకు చెల్లిస్తున్నారు. రోజూ ఈ ప్రాంతం నుంచి అయిదు నుంచి పది వాహనాల్లో భైంసా, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు తరలి ఎళ్తుంది. ఇందులో కొన్నింటికే మార్కెట్ ఫీజు వసూలు అవుతుందనే ఆరోపణలున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ. 17,98,240ల ఫీజును వసూలు చేశారు. వేములవాడ మార్కెట్ పరిధిలోని తిప్పాపూర్, కోనాయిపల్లి వద్ద ఉన్న రెండు చెక్ పోస్టుల ద్వారా నామమాత్రపు ఫీజు వసూలు చేసి సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. గ్రామాల్లో దళారులు పెద్ద ఎత్తున సేకరించి ఇతర ప్రాంతాలకు తరలించడంతో మార్కెట్ కమిటీ భారీగా ఆదాయాన్ని కోల్పోతోంది. దీనికి తోడు జిన్నింగ్ మిల్లులకు పత్తి దిగుబడులు రాక మిల్లుల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు తరలింపువ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లకు అధికారులు నిర్లక్ష్యం చూపడంతో దళారులకు కాసుల పంట పండుతోంది. ఇదే అదనుగా దళారులు గ్రామాల్లో పత్తిని నిబంధనలకు విరుద్ధంగా సేకరించి సొమ్ము చేసుకుంటున్నా మార్కెట్ కమిటీ అధికారులు మామూలుగా తీసుకొంటున్నారు. మార్కెట్ పరిధిలో 26 మంది లైసెన్స్ వ్యాపారులున్నప్పటికీ యార్డులో మాత్రం కొనుగోళ్లు చేయడం లేదు. జిల్లాలో ఈ సీజన్‌లో 69,200 ఎకరాల్లో పత్తి సాగు కాగా మొత్తం 4.84 లక్షల క్వింటాళ్లు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటి వరకు జిల్లాలో కేవలం 20,500 క్వింటాళ్లు మాత్రమే జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు జరిగినట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. గ్రామాల నుంచి రెండింతల పత్తిని దళారులు ఇతర ప్రాంతాలకు తరలించారని వ్యాపారులు పేర్కొంటున్నారు. బుధవారం మార్కెటింగ్‌శాఖ అధికారులు, మార్కెట్ పాలక వర్గం వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులతో హడావుడిగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినా యార్డులో పత్తి కొనుగోళ్లకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యార్డులో కొనుగోళ్లు ప్రారంభిస్తే రైతులే పత్తిని తీసుకు రావడం లేదని అధికారులు కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారే తప్పా సేకరణకు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా మార్కెట్ అధికారులు, పాలకవర్గం యార్డులో పత్తి కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని కర్షకులు కోరుతున్నారు.

రైతులు ముందుకు రావడం లేదు– సత్యనారాయణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వేములవాడ

మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తే విక్రయించేందుకు రైతులు ముందుకు రావడం లేదు. యార్డుకు తీసుకువస్తే రవాణా, హమాలీ వంటి ఛార్జీలవుతున్నాయని గ్రామాల్లోనే విక్రయిస్తున్నారు. గత ఏడాది పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తే రెండు రోజులు కూడా రైతులు తీసుకురాలేదు. పత్తిని కొనుగోలు చేసే వ్యాపారులు తక్కువ ఉన్నారు.

# ఆందోళనలు ఉద్ధృతం



జగిత్యాల : మాస్టర్‌ప్లాన్‌పై ఆందోళనలు ఉద్ధృతమవుతున్నాయి. పట్టణ మాస్టర్‌ప్లాన్‌లో సమీప గ్రామాల పరిధులను చేర్చి వివిధ జోన్లుగా ఏర్పాటు చేస్తూ జగిత్యాల పురపాలక సంఘం గత సంవత్సరం మార్చి 8న తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిన నేపథ్యంలో గత నెల 15న జీవో 238 ద్వారా ఆమోదిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. జగిత్యాల మాస్టర్‌ప్లాన్‌పై ఆందోళనలు ఉద్ధృతమవుతున్నాయి. పట్టణ మాస్టర్‌ప్లాన్‌లో సమీప గ్రామాల పరిధులను చేర్చి వివిధ జోన్లుగా ఏర్పాటు చేస్తూ జగిత్యాల పురపాలక సంఘం గత సంవత్సరం మార్చి 8న తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిన నేపథ్యంలో గత నెల 15న జీవో 238 ద్వారా ఆమోదిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పట్టణ మాస్టర్‌ప్లాన్ పరిధిలో నర్సింగాపూర్, మోతె, తిమ్మాపూర్, తిప్పన్నపేట, హస్నాబాద్ తదితర గ్రామాల పరిధులను చేర్చటమే కాకుండా వివిధ జోన్ల కిందికి తేవటంతో రైతులు, రాజకీయాలకతీతంగా అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు భగ్గుమన్నారు. సంక్రాంతి పండక్కి ముందే పురపాలక సంఘం ముందు ధర్నాలు చేయటమే కాకుండా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. మళ్లీ ఆందోళనలు ఉద్ధృతం చేశారు. జగిత్యాల–నిజామాబాద్ జాతీయ రహదారిపై హస్నాబాద్, ఉప్పరిపేట, అంబారిపేట రైతులు ప్రజాప్రతినిధులు రాస్తారోకో నిర్వహించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. జగిత్యాల–ధర్మపురి జాతీయ రహదారిపై తిప్పన్నపేట వద్ద తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట రైతులు ఆందోళనకు దిగారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. తిమ్మాపూర్ గ్రామంలో ప్రజలు సమావేశమై మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంగా సర్పంచి రమ్య, వార్డు సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. మోతె, నర్సింగాపూర్ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, రైతులు సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారు. దీనిలో మాజీమంత్రి శాసనమండలి సభ్యుడు టి.జీవన్‌రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు.

మార్చిలోనే తీర్మానం జగిత్యాల మాస్టర్‌ప్లాన్ 2041 కోసం గత మార్చిలోనే పురపాలక సమావేశం తీర్మానించింది. రానున్న 20 ఏళ్ల కోసం పట్టణ జనాభా 2,02,988గా పేర్కొంటూ పట్టణ పరిధిని 60.87 చదరపు కిలోమీటర్లుగా పేర్కొంటూ సమీప గ్రామాలైన తిప్పన్నపేట, తిమ్మాపూర్, మోతె, నర్సింగాపూర్, హస్నాబాద్, లింగంపేట, కండ్లపల్లి, ధరూర్ తదితర గ్రామాల పరిధులను చేర్చారు. మార్చి 8న తీర్మానం(నెం 294) చేసి ప్రభుత్వానికి పంపించారు. గ్రామ పంచాయతీల పరిధిని కలిపిన మాస్టర్‌ప్లాన్‌కు సమ్మతి తెలపాల్సిందిగా ఏప్రిల్ ఒకటిన పురపాలక కమిషనర్ పరిసర గ్రామ పంచాయతీలకు లేఖ రాయగా మోతె, తిప్పన్నపేట, ధరూర్, తిమ్మాపూర్, హస్నాబాద్, నూకపల్లి గ్రామపంచాయతీలు జున్, జులై నెలలో తీర్మానాలిచ్చాయి. అయితే తమకేమీ తెలియదని ముద్రించిన తీర్మాన ప్రతులపై తమపై బలవంతంగా సంతకాలు తీసుకున్నారని ఆయా గ్రామాల సర్పంచులు పేర్కొంటున్నారు. గ్రామాల పరిధిలోని విలువైన వ్యవసాయ భూములను రిక్రియేషన్, పబ్లిక్, సెమిపబ్లిక్, ఇండస్ట్రియల్ తదితర జోన్లుగా పేర్కొనటంతో అవసరం లేకున్నా పంట పొలాల్లోంచి వెడల్పైన కొత్త రహదారులను ప్రతిపాదించటంతో రైతులు భగ్గుమంటున్నారు. 60 రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని కోరుతున్నా అవేమీ తమకు సంబంధం లేదని మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలోని కొన్ని రహదారులను వెడల్పు తగ్గిస్తూ ప్రతిపాదించటం కొన్ని నివాసాలను బఫర్‌జోన్‌గా పేర్కొనడం విమర్శలకు తావిస్తోంది. మొత్తం మీద మాస్టర్‌ప్లాన్ వివాదం రోజురోజుకూ ముదురుతోంది.

# ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ తప్పనిసరి: కలెక్టర్

సూర్యాపేట : జిల్లాలో చేపట్టే కంటి వెలుగును విజయవంతం చేయాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో కలిసి కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణపై ప్రత్యేక అధికారులు, వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటి వెలుగు నిర్వహణకు జిల్లాలో 50 బృందాలను ఏర్పాటు చేసినట్లు, మరో మూడు బృందాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. శిబిరాలలో ప్రభుత్వ నిబంధనల మేరకు మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి శిబిరాలలో అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రాలు, కరపత్రాలు అందించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యేక అధికారులు, వైద్యాధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. అంతకు ముందు ఖమ్మం కలెక్టరేట్ నుంచి మంత్రి హరీశ్‌రావు అన్ని జిల్లాల కలెక్టర్లతో దూర దృశ్య శ్రవణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష అనంతరం స్థానిక కలెక్టరేట్లో పాల్గొన్న కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు జి.శ్రీనివాస్, కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ మాట్లాడారు. జిల్లాలో కంటి వెలుగు శిబిరాల నిర్వహణ షెడ్యూల్‌ను సంబంధిత ప్రజాప్రతినిధులకు ముందే తెలియజేయాలన్నారు. నిర్వహణ సమయంలో విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలన్నారు. అంతకుముందు ప్రజారోగ్య వైద్య సంచాలకులు డా.శ్రీనివాస్ అంబేద్కర్ నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న కంటివెలుగు నమూనా శిబిరాన్ని సందర్శించి సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఎదురైతే పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఎస్పీ రాజేంద్రప్రసాద్, డీఎంహెచ్‌వో కోటా చలం, ఆర్డీవో కిశోర్‌కుమార్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వేత్రా చిక్కులు

నల్గొండ : మిర్యాలగూడ మండలానికి చెందిన సంపత్‌కుమార్‌కు పక్కపొలం యజమానితో భూ సరిహద్దులపై వివాదం ఉంది. దీంతో సమగ్రంగా సర్వే చేసి తన భూ హద్దులను నిర్దేశించాలని సర్వే నిమిత్తం ప్రభుత్వానికి రుసుం కట్టి దరఖాస్తు చేశారు. ఆరు నెలలు గడుస్తున్నా అదిగో..ఇదిగో అంటున్నారు తప్పితే సర్వేకు రావడం లేదని, అవసరం అయితే ప్రైవేటు సర్వేయర్‌తో చేయించుకోవాలని సైతం సలహాలు ఇస్తున్నారని సంపత్‌కుమార్ తో ఆవేదన వ్యక్తం చేశారు.సర్వేయర్‌ల కొరత, దరఖాస్తు చేసి ఆరునెలలు గడిచినా సర్వే చేయకపోవడం తదితర కారణాలతో క్షేత్రస్థాయిలో భూ వివాదాలు ఎంతకూ పరిష్కారం కావడం లేదు. ధరణి వెబ్‌సైట్ వచ్చిన తర్వాత భూ వివాదాలు గతంలో కంటే భారీగా పెరగగా..వీటిని సర్వే చేసి పరిష్కరించాలని రైతులు కోరుతున్నా.. వారి మొర వినేవారే కరవయ్యారు. భూముల సర్వే నిమిత్తం టీపన్ (ప్రభుత్వానికి చెల్లించే పన్ను) కట్టి నాలుగైదు నెలలు గడుస్తున్నా సర్వేయర్లు రాక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో కలిపి మొత్తం 72 మండలాలు ఉండగా.. మండలానికి ఒక సర్వేయరుతో పాటూ డివిజన్ స్థాయికి ఒకరు చొప్పున ప్రస్తుతం సర్వేయరు పోస్టులున్నాయి. అయితే మూడు జిల్లాల్లోనూ ప్రస్తుతం 27 పోస్టులు ఖాళీగా ఉండటంతో చాలా మంది అదనపు మండలాల బాధ్యతలు చూస్తున్నారు. ఒక్క సూర్యాపేట జిల్లాలోనే 23 మండలాలకు గానూ కేవలం 11 మందే ప్రస్తుతం పనిచేస్తుండగా..12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డివిజన్ పోస్టులు సైతం ఖాళీగానే ఉండటంతో ఒక దరఖాస్తు పరిష్కరించడానికి



సుమారు ఏడాది సమయం పడుతోంది. మరోవైపు ప్రభుత్వ సర్వేయర్లు ఉన్న చోట... వాళ్లు కాకుండా బినామీలుగా ప్రైవేటు వారిని పెట్టుకుంటూ కొంత మంది అడ్డగోలుగా డబ్బులు సంపాదిస్తున్నారు. నల్గొండతో పాటూ సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడ, భువనగిరిల్లో భూమిని సర్వే చేయాలంటే హీనపక్షం రూ.10 వేలు ముట్టజెప్పాల్సి వస్తుందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. స్థిరాస్తి వ్యాపారం ఎక్కువగా ఉండి హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న ఉమ్మడి జిల్లాలోని రాజధాని పరిసర ప్రాంతాల్లో ఇది రూ.20 వేలకు పైగానే పలుకుతోంది. యాదాద్రి జిల్లాలో 17 మండలాలు ఉండగా...సాంకే తికంగా అన్ని పోస్టులు భర్తీగానే ఉండగా..పోటీ పరీక్షలకు సన్నద్ధం, ఇతరత్రా కారణాలతో పది మందికిపైగా ప్రస్తుతం సెలవులో ఉన్నట్లు తెలిసింది. సూర్యాపేట జిల్లాల్లోనూ సాంకేతికంగా అన్ని పోస్టులు భర్తీగానే ఉన్నా..ప్రస్తుతం ఏడుగురు సర్వేయర్లు సెలవులో ఉన్నట్లు సమాచారం. దీంతో ఉన్న సిబ్బందితోనే అన్ని మండలాల్లో సర్వే నిర్వహణ పనులు చేయిస్తున్నారు. చాలా మండలాల్లోని అధికారులు ప్రభుత్వపరంగా వచ్చే దరఖాస్తుల కంటే ప్రైవేటుగా చేయడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నారు.బినామీ దందాలో కీలకంగా ఓ జిల్లా ఉన్నతాధికారి

ఓ జిల్లా ఉన్నతాధికారి ప్రైవేటు సర్వేయర్లను బినామీగా పెట్టుకొని దందా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విషయం జిల్లా అధికార యంత్రాంగానికి తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికే మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లకు చెందిన పలువురు రైతులు సదరు అధికారిపై హైదరాబాద్ స్థాయిలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మరోవైపు ఓ జిల్లా ఉన్నతాధికారి ప్రభుత్వ చరవాణి నంబరు బిల్లు చెల్లించకపోవడంతో గత రెండు నెలలుగా ఆ నెంబరు పనిచేయడం లేదు. దీంతో ఎవరైనా వినియోగదారులు సదరు అధికారిని సంప్రదించాలంటే కుదరని పరిస్థితి నెలకొంది.

వివాదాస్పద భూములు ఎక్కువగా ఉన్న కృష్ణపట్టి ప్రాంతాలైన దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో సర్వేయర్లకు ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకొని సర్వే పేరుతో ప్రభుత్వ భూములను సైతం కొంత మంది ప్రజాప్రతినిధులకు ధారాదత్తం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ శాఖపై ఉన్నతాధికారులు పెద్దగా శ్రద్ధ పెట్టకపోవడం, క్షేత్రస్థాయిలో సర్వేయర్లకు కొరత ఉండటంతో ఈ ప్రాంతంలోని కొంత మంది ప్రభుత్వ సర్వేయర్లు ఆడింది ఆటగా నడుస్తోందన్న వాదనలున్నాయి. చాలా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో సర్వే చేయాలంటే ప్రైవేటు సర్వేయర్లే దిక్కుగా ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో వీరికి ప్రభుత్వ సర్వేయర్లే నెలకు వేతనాలు ఇచ్చి క్షేత్రస్థాయిలో పని కానిస్తున్నారు.

# కొత్తోళ్లకు బంధువుకాలే..!

నల్గొండ : రైతులకు పెట్టుబడి కష్టాలను దూరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి 2018 వానాకాలం నుంచి అమలు చేస్తోంది. పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన వారికి ఏటా రెండు సీజన్లలో ఎకరాకు రూ.5 వేల చొప్పున అందిస్తోంది. అయితే ఈ సారి కొత్తగా పాసుపుస్తకాలు పొందిన కర్షకులకు మాత్రం సాయం అందటం లేదు. ప్రతి సీజన్‌లో కొత్త రైతులను వెంటపడి మరీ దరఖాస్తు చేయించిన వ్యవసాయాధికారులు ఈసారి ముఖం చాటేస్తున్నారు. కొత్తవారి వివరాలు ఆధికారుల వద్దకు చేరినా ప్రభుత్వ స్థాయిలో అనుమతి రాకపోవడంతో రైతుబంధు అందటం కష్టమేనన్న భావన వ్యక్తమవుతోంది. నిలిచిన లాగిన్ సౌకర్యంగత వానాకాలం సీజన్‌లో జూన్ 28 నుంచి పెట్టుబడి సాయం అందించారు. జూన్ 20 వరకు పాసుపుస్తకాలు కలిగిన లేదా రిజిస్ట్రేషన్లు అయిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వ సాయం అందించింది. జులై 20 తరువాత కొనుగోలు, వారసత్వం కింద రిజిస్ట్రేషన్లు చేయించుకున్న రైతులు ఉమ్మడి జిల్లాలో 25,651 రైతులు ఉన్నారు. వీరంతా మండల స్థాయిలో రైతుబంధుకు దరఖాస్తు చేసుకున్నారు. వీరి వివరాలను ఏఓ, ఏఈవో లాగిన్‌లో నమోదు చేస్తే ఇప్పటికే పెట్టుబడి సాయం జమ అయ్యేది. కానీ ఈ సారి కొత్త రైతుల వివరాల నమోదుకు అవసరమైన లాగిన్ సౌకర్యాన్ని ఉన్నతాధికారుల నిలిపేశారని సమాచారం. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 10.81 లక్షల మందికి రైతుబంధు అందుతోంది. నిబంధనల ప్రకారం మరో 25,651 మందికి సాయం అందించాల్సి ఉంది. గత సీజన్ నుంచి ఇప్పటివరకు క్రయవిక్రయాలు, వారసత్వంగా భూములు దక్కించుకున్న కొత్త రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా రాష్ట్రస్థాయిలో ఆధికారులు చర్యలు తీసుకున్నారు వ్యవసాయశాఖ అధికారులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. ఆర్థికభారం కారణంగా కొత్త రైతులకు సాయం అందించడం లేదని తెలిసింది.నమోదు చేస్తాంసుచరిత, నల్గొండ జిల్లా వ్యవసాయశాఖ అధికారి మండలాల వారీగా రైతుబంధు సాయానికి కొత్త రైతుల జాబితా అందింది.

# ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తివిద్యా కోర్సులు

జనగామ : పాఠశాల స్థాయిలో వృత్తివిద్యా కోర్సులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల లభ్యత, వృత్తివిద్యా కోర్సుల అధ్యయనానికి సంబంధించిన సామగ్రిని అమర్చేందుకు తగిన వసతులున్న పాఠశాలలను గుర్తించి.. రాష్ట్ర వ్యాప్తంగా 241 పాఠశాలలను ఎంపిక చేశారు. మొత్తం 19 రకాల వృత్తివిద్యా కోర్సులను అందుబాటులో ఉంచి పదో తరగతి వరకున్న పాఠశాలల నుంచి వాటిలో రెండు కోర్సులను ఎంచుకోవాలని ప్రభుత్వం సూచించింది.

స్వయం ఉపాధికి భరోసా

పదో తరగతి పూర్తయిన తర్వాత స్వయం ఉపాధి కల్పించే, జనాదరణ పొందిన కోర్సులను అందించాలని నిపుణులు సూచించారు. ఇందుకోసం ప్రత్యేక అర్హతలున్న బోధకులను నియమిస్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 28 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వృత్తివిద్యా కోర్సులను ప్రారంభించనున్నారు.

సులభంగా నేర్చుకునేలా..

సులభంగా నేర్చుకునేందుకు వీలున్న 19 రకాల వృత్తివిద్యా కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. విద్యార్థుల ఆసక్తి మేరకు అదే ఆవాసంలో లేదా సమీప పట్టణంలో మంచి ఆదరణ కలిగిన రెండు కోర్సులను ఎంచుకొని తమకు సమాచారమిస్తే అందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పదో తరగతి కీలకమైంది కావడంతో నియత బోధనకు అంతరాయం కలగకుండా అదనపు సమయంలో వృత్తి విద్య నేర్పిస్తారు. పాఠ్యాంశాల బోధనతో పాటు ప్రాక్టికల్స్ కూడా



నిర్వహిస్తారు. వ్యవసాయానికి సంబంధించిన కోర్సుల్లో క్షేత్ర సందర్శన కూడా ఉంటుంది. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల ఆధారంగా కోర్సులను ఎంపిక చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులదే.

మొదటి రెండు దశల్లో..

పదో తరగతి వరకున్న పాఠశాలల్లో రెండు దశల్లో వృత్తివిద్యలు నేర్పిస్తారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు లెవెల్ ఒకటి పేరుతో.. విలువైన సమయాన్ని వృథా చేయకుండా ఏదైనా ఒక వృత్తివిద్య నేర్చుకోవాలని మానసికంగా సిద్ధం చేస్తారు.

రెండో దశలో విద్యార్థులు కిందటి తరగతిలో పేర్కొన్న కోర్సుకు తగిన శిక్షణ, క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారు. పదో తరగతి వార్షిక పరీక్షలు ముగిసేనాటికి విద్యార్థులు నేర్చుకున్న అంశంలో పట్టు సాధించేలా తర్ఫీదు ఇస్తారు. మిగతా రెండు దశలను ఇంటర్మీడియట్ వరకు ఉన్న విద్యాసంస్థల్లో అమలు చేస్తారు.

జనగామ : పాలకుర్తి, ధర్మకంచ(జనగామ), మల్కాపురం, కూనూరు

మహబూబాబాదు: దంతాలపల్లి, నర్సింహులపేట, డోర్నకల్, కొత్తగూడ, మహబూబాబాదు (యూఆర్బీ), కురవి, కేసముద్రం

జయశంకర్ : టేకుమట్ల, భూపాలపల్లి, మహదేవపూర్, చిట్యాల

ములుగు: తాడ్వాయి, మంగపేట

హనుమకొండ: ధర్మసాగర్, హసన్‌పర్తి, కాజీపేట, భీమదేవరపల్లి, పరకాల, శాయంపేట, వేలేరు, కమలాపురం

వరంగల్: రాయపర్తి, నెక్కొండ, నర్సంపేట

# ప్రసూతి సేవలకు.. పైసా వసూల్!

జనగామ : పేద మహిళలకు ప్రసూతి సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వసతులు కల్పించి సేవలు అందిస్తున్నా.. కొందరు సిబ్బంది చేతివాటంతో వసూళ్లకు పాల్పడుతున్నారు. అమాయక ప్రజలు ఉంటే బలవంతంగా దండుకుంటున్నారు. భూపాలపల్లి జిల్లా ఆసుపత్రిలో ఈ వసూళ్ల పర్వంపై బాధితులు ఆవేదన చెందుతున్నారు. ప్రసవం కోసం వచ్చిన మహిళ కుటుంబ సభ్యులు తప్పనిసరిగా అక్కడి సిబ్బందికి రూ.500 ఇవ్వాల్సిందే.. జిల్లా ఆసుపత్రికి భూపాలపల్లి జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వస్తుంటారు. ఇతర రాష్ట్రాల వారు, మారుమూల గ్రామాల ప్రజలు, అమాయకంగా కనిపించే వారి నుంచి రెట్టింపు డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ప్రతి పనికి రేటు..

ప్రసవమైన మహిళ కుటుంబ సభ్యుల నుంచి రూ.500 వసూలు చేస్తున్నారు.. అంతటితో ఆగకుండా ప్రతి పనికి ఒక రేటును నిర్ణయించి అడ్డగోలుగా దోస్తున్నారు.. అడిగిన డబ్బులు ఇవ్వకుంటే ఇబ్బందులు పెడతారేమోనని అడిగినంత ఇచ్చుకుంటున్నారు. ఎవరైనా డబ్బులు ఎందుకివ్వాలని ఎదురు ప్రశ్నిస్తే.. ప్రైవేటు ఆసుపత్రిలో డబ్బులు చెల్లించేవారు కదా.. ఇక్కడ వెయ్యి, రెండు వేలు ఇచ్చేందుకు కూడా ఇబ్బందవుతుందా అని ఎద్దేవా చేస్తున్నట్లు బాధితులు తెలుపుతున్నారు.

కానరాని పరిశుభ్రత

జిల్లా ప్రధాన ఆసుపత్రిలో అపరిశుభ్రత రాజ్యమేలుతోంది.. ఆసుపత్రిలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడంతో పాటు, మెట్లు ఎక్కే మూలలకు పాన్ గుట్కాలతో ఉమ్మివేయడంతో అక్కడంతా దుర్గంధంగా మారిపోయింది. పైపైన పారిశుద్ధ్య పనులు చేస్తుండటంతో ఆసుపత్రిలో ఎక్కడి చెత్త అక్కడే కనిపిస్తోంది. మరీ ముఖ్యంగా ప్రసూతి సేవల కోసం ఎంతో మంది గర్భిణులు, ప్రసవానంతరం పలు రకాల టీకాలు, ఇతర అనారోగ్య సమస్యలకు చికిత్స తీసుకునేందుకు చంటి పిల్లలతో ఆసుపత్రికి వస్తుంటారు. అలాంటి ఆసుపత్రిలో అపరిశుభ్రత రాజ్యమేలుతోంది..డబ్బులు ఇవ్వనంటే గొడవకు దిగుతున్నారు..

మా కుమార్తె ప్రసవానికి ఆసుపత్రికి తీసుకొచ్చాం.. ప్రసవం చేసిన తర్వాత అక్కడి సిబ్బంది రూ.500 అడిగారు. సరేలే అని ఇచ్చాం.. ఆ తర్వాత ఒక్కోదానికి ఒక్కో రేటుతో డబ్బులు అడుగుతున్నారు.. ఇదేంటని అడిగితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని.. మా మీదకే వస్తున్నారు.ఆకుల పద్మ, శంకరంపల్లి

ఉద్యోగాల నుంచి తొలగిస్తాంప్రసూతి సేవల విషయంలో డబ్బులు అడిగిన వారిపై ఫిర్యాదు చేస్తే అలాంటి వారిని అప్పటికప్పుడే తొలగిస్తాం. గతంలోనూ నా దృష్టికి వచ్చింది. సిబ్బందిని మందలించాం. మూడు షిఫ్టులు ఉన్నారు.. ఏ షిఫ్టు వారు డబ్బులు అడుగుతున్నారో తెలిపితే వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు.డాక్టర్ జీడీ తిరుపతి, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్

# పట్టుబట్టారు.. కొలువు కొట్టారు



జయశంకర్ :అందరివీ సాధారణ, వ్యవసాయ కుటుంబాలే.. జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్న పట్టుదల.. తల్లిదండ్రులు పడుతున్న కష్టం తీర్చాలని కృతనిశ్చయం.. చదువుకుంటూ ఉద్యోగ సాధనకు సన్నద్ధం అయినవారు కొందరు.. వివిధ ఉద్యోగాలు, పనులు చేసుకుంటూ సన్నద్ధం అయినవారు కొందరు. పట్టుదలతో చదివి చదివి లక్ష్యాన్ని అందుకున్నారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో ఎస్సై ఉద్యోగాలు సాధించిన విజేతలపై ప్రత్యేక కథనం..

తల్లిదండ్రుల కష్టమే పట్టుదల పెంచింది..

ఖానాపురం : పొలంలో తల్లిదండ్రులు పడుతున్న కష్టమే తనలో పట్టుదల పెంచి ఎస్సై పోస్టుకు ఎంపిక అయ్యేలా చేసిందంటున్నారు బండారు శివ. ఖానాపురం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఐలమ్మ, మల్లయ్య దంపతులకు ఒక కుమార్తె, ముగ్గురు కుమారులు. గ్రామంలోనే వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివించారు. రెండో సంతానమైన బండారు శివ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి, నర్సంపేటలో ఇంటర్, బీటెక్ పూర్తి చేశారు. 2018లో కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా గంగారం ఠాణాలో విధులు నిర్వహిస్తున్నారు. తరవాత ఎస్సై పోస్టులు పడటంతో సెలవు పెట్టి హనుమకొండలో సన్నద్ధమయ్యారు. ఎస్సైగా ఎంపికయ్యారు. పోలీసు కావాలని, పేదలకు రక్షణగా ఉండాలని తండ్రి చెప్పేవారని, ఆయన ఆశయాన్ని సాధించానని శివ చెబుతున్నారు. గ్రూప్–1 పరీక్ష కూడా రాశానని, అందులో కూడా విజయం సాధిస్తానన్న నమ్మకం ఉందన్నారు.

సివిల్స్ సాధించడమే లక్ష్యం..

వర్ధన్నపేట : ఎస్సైగా ఎంపిక అయినా సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని మండలంలోని రాందాన్ తండా పంచాయితీ పరిధిలోని మూడుగుండ్ల తండాకు చెందిన బానోత్ వెంకన్న అంటున్నారు. వ్యవసాయ ఆధారిత గిరిగిజన కుటుంబానికి చెందిన ఆయన పదో తరగతి వరకు వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని నరేంద్ర గురుకులంలో, ఇంటర్ హనుమకొండలోని శివాణి జూనియర్ కళాశాలలో చదివారు. కేయూలో బీటెక్, అలహాబాద్ ఎన్ఐటీలో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం ప్రభుత్వం రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌లో జూనియర్ ఇంజినీర్‌గా 2017 నుంచి 2019 డిసెంబర్ వరకు పనిచేశారు. సివిల్స్ లక్ష్యంతో ఉద్యోగానికి రాజీనామా చేసి 2020 నుంచి దిల్లీలో ఉంటూ సన్నద్ధం అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ నియామకాల్లో భద్రాద్రి జోన్‌లో సివిల్ ఎస్సైగా ఎంపిక అయ్యారు.

నా ఉద్యోగం అమ్మకు అంకితం..

నెక్కొండ : మండలంలోని దీక్షకుంట గ్రామానికి చెందిన అనంతగిరి మధు ఎస్సై ఉద్యోగానికి ఎంపిక అయ్యారు. తాను గర్భంలో ఉన్నప్పుడే తండ్రి అనారోగ్యంతో మృతి చెందారని, మాకోసం జీవితాన్ని ధారపోసిన అమ్మకు నా ఎస్సై ఉద్యోగం అంకితమని చెబుతున్నాడు మధు. రమ్మకు ఇద్దరు సంతానం కాగా.. పెద్ద కుమారుడు సిద్ధార్థ సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నారు. రెండో కుమారుడు మధు ఊళ్లోనే ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశారు. ఖమ్మంలో పాలిటెక్నిక్, హైదరబాద్‌లో బీటెక్ చేశారు. 2019లో సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం ఒక్క మార్కుతో పోయింది. 2022లో ఆమెకు క్యాన్సర్ ఉన్నట్లు తెలిసి మధు విలవిల్లాడారు. రైల్వేలో ఉద్యోగం సాధించిన తన అమ్మకోరిక మేరకు పట్టుదలతో ఎస్సై ఉద్యోగం సాధించానని చెబుతున్నారు. తనకు పెళ్లై 18 నెలల బాబు ఉన్నాడని తెలిపారు. తమకోసం జీవితాన్ని ధారపోసిన అమ్మను బతికించుకోవడానికి చికిత్స చేయిస్తున్నామని అన్నారు.

ఎస్సై కావాలనే కల నెరవేరింది..

సంగెం : మండలంలోని వంజరుపల్లి గ్రామానికి చెందిన పొన్నాల గోవర్ధన్ కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూనే ఎస్సైగా ఎంపికయ్యారు. తల్లిదండ్రులు సుగుణ, జనార్దన్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పదో తరగతి వరకు మచ్చాపురంలో, ఇంటర్మీడియట్ హనుమకొండలోని ఎస్వీఎస్ జూనియర్ కళాశాలలో, బీటెక్ రామప్ప ఇంజినీరింగ్ కళాశాలలో చదివారు. ఎస్సై కావడమే లక్ష్యంగా పెట్టుకొని 2016లో తొలి ప్రయత్నం చేయగా 1.75 మార్కుల తేడాతో ఉద్యోగం చేజారింది. అదే సమయంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో 2018లో ఉద్యోగంలో చేరి కొండాపూర్ 8వ బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్సై కావాలన్న పట్టుదలతో మళ్లీ ప్రయత్నించి సాధించారు. ఓపెన్ కేటగిరిలో భద్రాద్రి జోన్‌లో ఎస్సైగా ఎంపికయ్యారు.

తొలి ప్రయత్నంలోనే విజయం..

పర్వతగిరి : మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన గుండ్రపల్లి రోహిత్ మొదటి ప్రయత్నంలోనే ఎస్సై ఉద్యోగం సాధించారు. తండ్రి ప్రభాకర్ ములుగు పోలీసు స్టేషన్‌ల్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. తల్లి రోజా గృహిణి. రోహిత్ హనుకొండలోని తేజస్వి పాఠశాలలో పదో తరగతి, నారాయణ కళాశాలలో ఇంటర్ చదివారు. అనంతరం బీటెక్ మెకానికల్ పూర్తి చేశారు. తండ్రిని చూసి పోలీసు ఉద్యోగంపై మక్కువ పెంచుకున్న రోహిత్ ఇంజినీరింగ్ చేసినా పోలీసు అధికారి కావాలన్న పట్టుదలతో సన్నద్ధమయ్యారు. ఎస్సైగా ఎంపిక అయ్యారు. తన విజయానికి కుటుంబ సభ్యుల సహకారం, ప్రోత్సాహం మరువలేనిదని పేర్కొన్నారు.

దూర విద్యలో డిగ్రీ చేసి..

మల్లంపల్లి గ్రామానికి చెందిన బూర రఘుబాబు దూర విద్యలో డిగ్రీ చేసి ఎస్పీఎఫ్ ఎస్సైగా ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన బూర నారాయణ, శోభారాణి దంపతుల కుమారుడు రఘుబాబు విద్యాభ్యాసం ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే జరిగింది. పాలిటెక్నిక్ పూర్తిచేసిన ఆయన ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తూనే దూర విద్యలో డిగ్రీ చదివారు. 2020లో లాసెట్‌లో రాష్ట్ర స్థాయి 60వ ర్యాంకు సాధించి హైదరాబాద్ ఉస్మానియా న్యాయ కళాశాలలో సీటు పొందారు. ఎల్ఎల్‌బీ ఆఖరి సంవత్సరం చదువుతూనే ఎస్సై ఉద్యోగానికి సన్నద్ధమయ్యారు. తెలంగాణ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకొని లక్ష్యం సాధించారు.

# పొలాల గట్లే బడిబాటలు!



జనగామ : పంట పొలాల గట్ల వెంబడి జాగ్రత్తగా నడుచుకుంటూ వెళ్తున్న ఈ చిన్నారులను చూసి క్షేత్ర పర్యటనకు వెళ్లారని అనుకుంటే పొరపాటే.. ఇక్కడి విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే నిత్యం ఇలా అర కిలోమీటరు పొలాల గట్లు, కాలువలు దాటాల్సిందే. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రాందాన్‌తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో కలిసి 40 మందికి పైగా విద్యార్థులు ఉండగా ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ పాఠశాల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. పాఠశాల పంటపొలాల మధ్య ఉండడంతో దారి లేక కొన్నేళ్లుగా గర్భిణులు, చిన్నారులు పోషకాహారం కోసం వచ్చివెళ్లడానికి సైతం ఇబ్బంది పడుతున్నారు. రెండేళ్ల కిందట ఓ విద్యార్థికి పాము కాటేసింది. సకాలంలో చికిత్స చేయడంతో ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. గతేడాది ఈ సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ, ఎస్సారెస్పీ, పోలీసు, ఎంపీడీవో, విద్యాశాఖ అధికారులు పాఠశాల సమీపంలోని రైతులతో మాట్లాడి పాఠశాలకు వెళ్లే దారి హద్దులను గుర్తించారు. రోడ్డు వేస్తామన్నారు.. ఆచరణకు నోచుకోలేదు. ఇటీవల హద్దులను తొలగించి దుక్కులు దున్నారు. దీంతో దారి సమస్య పునరావృతమైంది. ఉపాధ్యాయురాలు షకీరాబేగం ఈ నెల 2న ఎస్సారెస్పీ కాలువను దాటుతూ ప్రమాదవశాత్తు కింద పడడంతో చేయి విరిగింది. పాఠశాలకు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం పాఠశాలలో 27 మంది విద్యార్థులకు 12 మంది మాత్రమే తరగతులకు హాజరవుతున్నారు. ఆర్థిక భారమైన ప్రైవేటు పాఠశాలలకు పంపాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

# కొత్త అంబులెన్సులు వచ్చేశాయ్

జనగామ : జిల్లా ప్రజలకు అత్యవసర సేవలందించేందుకు 10 కొత్త అంబులెన్స్‌లు అందుబాటులోకి వచ్చాయి. ప్రమాదాల బారినపడిన వారిని, అనారోగ్యంతో బాధ పడుతున్న వారిని ఆసుపత్రికి తరలించేందుకు, గర్భిణులకు అత్యవసర సేవలు అందించేందుకు వైద్యఆరోగ్యశాఖ మంజూరు చేసిన వాహనాలు జనగామకు చేరాయి. జిల్లాలో మొత్తం 12 మండలాలున్నప్పటికీ 10 నూతన అంబులెన్స్‌లు, నాలుగు పాత వాహనాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఏడు 108 వాహనాలు కాగా, మిగతావి 102 వాహనాలు. ఈ 14 వాహనాల్లో పది వాహనాలు మరమ్మతులకు గురి కావడంతో అత్యవసర సేవలకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. ప్రమాద సమయాల్లో ఇతర ప్రాంతాల నుంచి మరో వాహనం వచ్చేందుకు ఆలస్యమవుతుండటంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. వాటి స్థానంలో కొత్త వాహనాలు రావడంతో ఇకపై అత్యవసర సేవలకు ఎలాంటి అంతరాయం ఉండదని అధికారులు వివరిస్తున్నారు.

ఐదు మండలాలకు లేనట్లే ..

నిరుపేద కుటుంబాలకు చెందిన గర్భిణులు, బాలింతలకు మాత్రమే వైద్య సేవలందించేందుకు ఉపయోగపడే 102 అంబులెన్స్ వాహనాలు జిల్లాలో ఏడు మాత్రమే ఉన్నాయి. ప్రమాదాల సమయంలో క్షతగాత్రులను, ప్రసవ సమయంలో గర్భిణులు, గుండెపోటు, పక్షవాతం వచ్చిన వారిని అత్యవసరంగా ఆసుపత్రులకు తరలించేందుకు ఉపయోగపడే 108 వాహనాలు జిల్లాలో ఏడు మాత్రమే ఉన్నాయి. దీనితో జిల్లాలోని బచ్చన్నపేట, నర్మెట్ట, తరిగొప్పుల, లింగాలఘనపురం, చిల్పూరు మండలాలకు 108 వాహనాను కేటాయించకపోవడంతో సమీప మండలాల్లోని వాహనాలను పంపిస్తున్నారు. దీంతో జాప్యం జరుగుతోంది. ఈ ఐదు మండలాలకు సైతం 108 అంబులెన్స్‌లను




కేటాయిస్తే జిల్లాలోని ప్రజలందరికీ అత్యవసర సేవలు అందుబాటులోకి వస్తాయంటున్నారు.

వైకుంఠ వాహనం లేక ఇబ్బందులు

రాష్ట్రంలో పరమపద వాహనం లేని ఏకైక జిల్లా జనగామ. ఈ వాహనం అందుబాటులో లేకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రుల్లో మృతి చెందిన వారిని స్వగ్రామాలకు తరలించేందుకు, రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల సంఘటనల్లో మృతి చెందిన వారిని శవపరీక్షకు తరలించి తిరిగి స్వగ్రామానికి చేర్చేందుకు పేదలు అవస్థలు పడుతున్నారు. శవాలను తరలించేందుకు ప్రైవేటు వాహనాల చోదకులు వేలాది రూపాయలను డిమాండ్ చేస్తున్నారు. మారుమూల గ్రామాల్లో వాహనాలు అందుబాటులో లేక శవపరీక్షలో జాప్యం జరుగుతోంది. జిల్లాకు పరమపద వాహనం కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పీహెచ్‌సీలకు తరలిస్తాం

జిల్లా కేంద్రానికి వచ్చిన నూతన వాహనాలను త్వరలో మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలిస్తాం. పాడైన వాహనాల స్థానంలో నూతన వాహనాలు రావడం హర్షణీయం. జిల్లాకు ఒక పరమపద వాహనం అందిస్తే పేద ప్రజలందరికీ సేవందించేందుకు మా సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.మంద శ్రీనివాస్, 108 జిల్లా మేనేజర్

# మందుల అమ్మకాలపై కొరవడిన నిఘా

జగిత్యాల : పైర్లపై చీడపీడల నియంత్రణకు వినియోగించే సస్యరక్షణ మందుల అమ్మకాలపై నిఘా కొరవడి రైతులకు ఆర్థిక నష్టాన్ని మిగులుస్తోంది. ఉత్పాదకాలను ఇష్టారీతిన అమ్మటంతో దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి.

వాడకం తప్పనిసరవడంతో..

జగిత్యాల జిల్లాలో 1.74 లక్షల మంది రైతులు సాధారణ పరిస్థితుల్లో ఒక సీజన్‌లో 4.43 లక్షల ఎకరాల్లో ఆహార, ఉద్యాన పంటలను సాగు చేస్తారు. దిగుబడుల సాధనకు ఇటీవల ప్రతి పంటలోనూ రసాయన ఎరువులు, పురుగు మందులు, కలుపు నివారణ, పోషకాల వాడకం తప్పనిసరిగా మారింది. పత్తిలో హెక్టారుకు 3.7 లీటర్ల నుంచి 5–9 లీటర్ల వరకు పురుగు మందులను వాడుతున్నారు. వరిలో హెక్టారుకు 3 లీటర్ల పురుగు మందులు, 10 కిలోల గుళికలను వేస్తుండగా మొక్కజొన్నలో 6.5 కిలోల గుళికలు, మామిడిలో 16 లీటర్ల మందు, మిగిలిన పంటల్లోనూ 1.5–4.0 లీటర్ల మందును రైతులు వాడుతున్నారు.

నష్టం ఇలా..

పలుచోట్ల వ్యవసాయశాఖ లైసెన్స్ లేనివారు, శిక్షణ పొందనివారు, కిరాణాలు, గ్రామాల్లో తిరిగే కంపనీల ప్రతినిధులు రైతులకు పంట ఉత్పాదకాలను విక్రయిస్తున్నారు. గంట గుళికలు, పసలేని పోషకాలు, బయోలు, సేంద్రియ ఎరువులను అంటగడుతున్నారు. చాలామంది రైతులు తమ పంట నమూనాలను దుకాణాలకు తీసుకొచ్చి సస్యరక్షణ మందులను కొని తీసుకెళ్లి వాడుతున్నారు. ఇదే సమయంలో అనుభవంలేని కొందరు దుకాణాదారులు పురుగు మందు, తెగుళ్లమందు, పోషకాన్నిచ్చి ఒకేసారి పంటపై వాడాలని రైతులకు



సూచిస్తున్నారు. దీనివల్ల రైతుకు ఖర్చు పెరగటం, మొక్కల్లో మందుల అవశేషాలు పెరిగి మన ఆరోగ్యాలకు నష్టం చేస్తోంది. సరియైన మందు ఇవ్వనప్పుడు చీడపీడలు, కలుపు నివారణ జరగక మరోసారి మందులనుమార్చి పచికారీ చేయాల్సి వస్తోంది. మందుల తీవ్రతను తెలపకపోవటం, మందులను చల్లుతున్నప్పుడు జాగ్రత్తలను చెప్పకపోవటంతో రైతులు మృత్యువాత పడుతున్న ఘటనలూ జరుగుతున్నాయి.

అర్హులకు అవకాశం

పంట ఉత్పాదకాలను అమ్మేచోట నిపుణులైనవారు అందుబాటులో ఉన్నట్లయితే రైతులకు అనవసర మందుల వాడకం తగ్గి ఆర్థికంగా కలిసివస్తుంది. ఇప్పటికే జిల్లాలో పలువురు దుకాణాలు నిర్వహిస్తున్నవారు వ్యవసాయ వర్సిటీ కోర్సును పూర్తిచేసి సర్టిఫికెట్ పొందారు. ఏజీబీఎస్సీ, రసాయనశాస్త్ర డిగ్రీ లేదా వ్యవసాయ వర్సిటీ డిప్లొమా పూర్తి చేసినవారికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ సర్టిఫికెట్లు లేనివారి దుకాణాల్లో పురుగు మందులను విక్రయించకుండా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలి. కేవీకేలు, వ్యవసాయశాఖ సమేతి, హైదరాబాద్‌లోని మేనేజ్ సంస్థ ద్వారానూ పురుగు మందుల అమ్మకాలపై సర్టిఫికెట్ కోర్సును నేర్చుకోవచ్చు. ఈ నిబంధనలతో పాటుగా అధికారులు చీటీ రాసిస్తేనే దుకాణాదారులు రైతులకు మందులను అమ్మాలనే నిబంధనలను కూడా అమలు చేయాల్సి ఉంది. దీనిపై డీఏవో పి.సురేశ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు లైసెన్స్ గల దుకాణాల్లోనే ఉత్పాదకాలను కొనుగోలు చేసి బిల్లులను తీసుకోవాలని సూచించారు.

# ఖాళీ స్థలాలు.. దుర్గంధానికి నిలయాలు

జగిత్యాల : నగరంలో రూ.కోట్లు ఖర్చు చేసి.. ఆదర్శంగా తీర్చిదిద్దిన హౌసింగ్‌బోర్డు కాలనీలో సమస్యలు వేధిస్తున్నాయి. శిథిల క్వార్టర్లు, ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు దుర్గంధానికి నిలయంగా మారాయి. వర్షం పడిన తర్వాత కొన్ని రోజుల వరకు ఆ ఆ స్థలంలో నీరు నిలిచి కుంటను తలపిస్తోంది. కాలనీలోని రిజర్వాయర్ సమీపంలోని రెండోవీధిలో హౌసింగ్‌బోర్డుకు ఎకరం స్థలముంది. చుట్టూ ప్రహరీ నిర్మించి భద్రంగా ఉండగా ఇటీవల వర్షాలకు రెండు వైపులా కొంతమేర కూలిపోగా, మరో వైపు ఒరిగింది. చెత్తా చెదారం, మట్టి కుప్పలతోపాటు పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. వలస వచ్చిన వారు ఇందుల్లోనే బహిరంగ మల విసర్జనకు వెళ్తుండటంతో స్థానికులు అభ్యంతరం తెలుపుతున్నారు. నగర పాలక సంస్థ అధికారులు కట్టడి చేయడంలేదని ఆగ్రహిస్తున్నారు. పందులు చనిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పాములు ఇళ్లలోకి



వస్తున్నాయని చెబుతున్నారు. ఈ ఖాళీ స్థలాన్ని నగర పాలక సంస్థ స్వాధీనం చేసుకొని శుభ్రం చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు. కాలనీలో మొత్తం 1200 ఇళ్లు ఉండగా సుమారు 60కి పైగా వదిలేసినవి, శిథిల భవనాలు ఉన్నాయి. వీటికి కిటికీలు, తలుపులు, ప్రహరీలు లేకపోవడంతో.. పాములు, కుక్కలు, పందులు, ఇతర పశువులకు అడ్డాగా మారాయి. రాత్రి పూట ఇళ్లలోకి విష కీటకాలు వస్తున్నాయని ఆ ప్రాంతవాసులు అంటున్నారు.

దోమలతో ఇబ్బంది

ఖాళీ స్థలంలో నిలిచిన నీరును తొలగించాలి. అక్కడ చెత్తా చెదారం ఉండటంతో విపరీతంగా దోమలు వస్తున్నాయి. రాత్రింబవళ్లు అవి కుడుతుండగా వ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

కవిత, స్థానికురాలు

# 3 విడతలు.. 12 టీకాలు

ఖమ్మం : వైద్యారోగ్య శాఖ జిల్లా సర్వజన ఆసుపత్రులతో పాటు అన్ని దవాఖానాల్లో నిర్దేశిత రోజుల్లో, ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా గర్భిణులు, 19 ఏళ్లలోపు వారికి సాధారణ టీకాలు (రొటీన్ వ్యాక్సిన్) వేస్తుంది. సకాలంలో వీటిని పొందని వారెవరైనా ఉంటే.. సమాజ ఆరోగ్య సంరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 'మిషన్ ఇంద్రధనుష్' కార్యక్రమాన్ని 2016 నుంచి ప్రారంభించింది. గతంలో ఏడు రకాల వ్యాక్సిన్లు వేసేవారు. ప్రస్తుతం రోగ నిరోధక శక్తి పెంచేందుకు టీకాల సంఖ్య 12కి పెంచారు. వీటిల్లో గర్భిణులకు చెందినవి రెండున్నాయి. సమయానికి వీటిని పొందని వారికోసం ఏటా మూడు విడతల్లో 'మిషన్ ఇంద్రధనుష్' నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది తొలి విడత కార్యక్రమం ఉభయ ఖమ్మం జిల్లాల్లో ప్రారంభమైన నేపథ్యంలో గర్భిణులు,



చిన్నారులు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అందించే వ్యాక్సిన్లు..

గర్భిణులకు.. టీడీ (టెటనస్ అండ్ డిప్తీరియా)

చిన్నారులకు.. టీబీ, పోలియో, హెపటైటిస్–బీ, డిప్తీరియా, హెపటైటిస్, టెటనస్, హిమోఫిలస్, రోటా వైరస్, నిమోకోకల్ న్యుమోనియా, మీజిల్స్, రుబెల్లా, జపనీస్ ఎన్‌సెఫలిస్.

ప్రతి ఏటా నిర్వహించే 'మిషన్ ఇంద్రధనుష్'ను గర్భిణులు, పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సరైన భాగస్వామ్యాన్ని అందించాలి. గతంలో 12 రకాల వ్యాక్సిన్లు పొందని చిన్నారులు, రెండు రకాల టీకాలు వేయించుకోని గర్భిణులుంటే స్థానిక వైద్య బృందాలకు తెలపాలి. ఆరోగ్య సంరక్షణకు టీకాలు వేయించుకోవడం తప్పనిసరని గుర్తించాలి. కార్యక్రమ విజయంతానికి శాఖాపరంగా తగిన అవగాహన, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.డా.బి.బాలాజీ, ఇమ్యునైజేషన్ అధికారి, భద్రాద్రి

# చింత వదిలించుకుంటేనే మేలు

జనగామ : రఘునాథపల్లిలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని రెండేళ్లుగా చింతపండు సమస్య వేధిస్తోంది. చింతపండును నిల్వ చేసిన శీతల గోదాముకు రెండేళ్లుగా అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. చింతపండును వదిలించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వివరాలివి.. ఈ సంఘం అధ్యక్షురాలు ఇటీవల రాజీనామా చేశారు. రికార్డులను అప్పగించే క్రమంలో రెండేళ్ల క్రితం కొనుగోలు చేసిన చింతపండు విషయం వెలుగులోకి వచ్చింది.

సంఘంపై అద్దె భారం

మొదట రఘునాథపల్లి, సమీపంలోని ఏడు మండలాల రైతులు కలిసి రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత రైతులు వాటాధనం చెల్లించి టోకు ధరకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను కొనుగోలు చేసేవారు. ఈ సంఘం నాలుగైదేళ్ల పాటు లాభాల బాటలో నడిచింది. తర్వాత వ్యాపారాన్ని వృద్ధి చేసుకునేందుకు రెండేళ్ల క్రితం స్థానిక పొదుపు సంఘాల ద్వారా రైతుల నుంచి 5,890 కిలోల చింతపండును కొనుగోలు చేశారు. ఒక్కో కిలోకు రూ.65 నుంచి రూ.90 వరకు ధర చెల్లించారు. అప్పట్లో కరోనా వ్యాప్తి చెందడంతో చింతపండును కొనుగోలు చేసేందుకు వినియోగదారులు వెనుకంజ వేశారు. సంఘం బాధ్యులు చింతపండును తమిళనాడులోని సంస్థకు పంపించేందుకు ప్రయత్నించారు. ఆ సంస్థ సూచనల మేరకు గింజలను తీసి చింతపండును శుభ్రం చేసి వినియోగించేందుకు అనువుగా ప్యాకింగ్ చేశారు. ఒకటి, రెండు రూపాయల తేడా రావడంతో తమిళనాడు సంస్థ చింతపండు కొనేందుకు విముఖత వ్యక్తం చేసింది. దీంతో ఒప్పందం కుదరలేదు. ఈ చింతపండును ఏం చేయాలని ఆలోచించిన సంఘం చింతపండును శీతల గోదాములో భద్రపరిచింది. మంచి గిరాకీ రాగానే విక్రయించాలని నిర్ణయించింది. రెండున్నరేళ్లుగా ఈ



చింతపండుకు ఆశించినంత గిరాకీ రాలేదు. ఏడాదికి టన్ను చింతపండుకు రూ.2 వేల చొప్పున అద్దె చెల్లిస్తుండడంతో సంఘంపై ఆర్థిక భారం పడుతోంది.

పాత పండు కొటారా?

చింతపండు విషయం ఇటీవల వెలుగులోకి రావడంతో దీన్ని విక్రయించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీనిపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చింతపండును శీతల గోదాములో భద్రపర్చినా నాణ్యత తగ్గుతుందని, వినియోగదారులు తాజాగా వచ్చిన పంట ఉత్పత్తిని కొనుగోలు చేస్తారే తప్ప పాత చింతపండును కొనేందుకు సుముఖంగా ఉండరని చెబుతున్నారు. ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి.

నష్ట నివారణకు చర్యలు

గోదాములో ఉన్న చింతపండును స్వాధీనం చేసుకొని, ఉమ్మడి జిల్లాలోని సంక్షేమశాఖ అధికారులతో మాట్లాడి.. వసతి గృహాలకు విక్రయించాలని అనుకుంటున్నారు. వారంలోగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని చెబుతున్నారు. పెద్దగా లాభాలు రాకున్నా నష్టం రాకుండా బయటపడేందుకు అన్ని మార్గాలను పరిశీలిస్తున్నామని వెల్లడిస్తున్నారు. వ్యాపారాన్ని పెంచుకోవాలనే క్రమంలోనే చింతపండును కొనుగోలు చేశామని, వినియోగదారులకు నాణ్యమైన సరకును అందించాలనే తపనతో శుభ్రం చేసి శుభ్రం చేశారని, వేరే ఆలోచనలు లేవని అధికారులు చెబుతున్నారు.

# కార్మికుల కొరత.. పారిశుద్ధ్య చర్యలకు వెత



పాల్వంచ : వ్యాధులొస్తే వైద్యులు రక్షిస్తారు. అసలు రోగాలు వ్యాప్తి చెందకుండా సమాజాన్ని కాపాడే ప్రయత్నం చేసేవారిలో పారిశుద్ధ్య కార్మికులు ముందువరుసలో నిలుస్తారు. పట్టణాలు, నగరాలు గుణాత్మక అభివృద్ధిని సాధించడంలో వీరి శ్రమ విస్మరించలేనిది. జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు సాధించడం వెనుకా ఎంతో కృషి దాగిఉంది. ఎంతటి కష్టకాలంలోనైనా రహదారులు, గల్లీలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెరుగుతున్న జనాభా ప్రకారం కార్మికుల నియామకాలు చేపడితేనే అంతటా పారిశుద్ధ్యం మెరుగువుతుంది. ముఖ్యంగా వర్షాకాలం సీజన్‌లో తరుణ వ్యాధులు, జ్వరాలు ప్రబలకుండా ఎప్పటికప్పుడు కాలువలు శుభ్రం చేయించడం, చెత్త తరలించడం వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఈ దిశగా పురపాలక యంత్రాంగాలు చర్యలు చేపట్టాల్సిన తరుణమిది. పని ఒత్తిడి తగ్గితే కార్మికులు విధుల్లో మరింత అంకితభావం చూపుతారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఉభయ జిల్లాలోని పురపాలకాలు, నగరంలో 2011 జనాభా ప్రకారం నియమించిన పోస్టులే దిక్కుగా మారాయి. అవికూడా చాలా వరకు ఖాళీగా ఉండగా.. తాత్కాలిక పారిశుద్ధ్య కూలీలపై ఆధారపడి పనులు చేపట్టే పరిస్థితి నెలకొంది. కొత్తవారిని నియమించుకుని స్వచ్ఛతకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంకా కావాల్సింది.. 840 మంది..ఉభయ జిల్లాలో ఖమ్మం నగరపాలకంతో పాటు మరో ఏడు పురపాలకాలు ఉన్నాయి. ఆయాచోట్ల జవాన్లు కేటాయించిన ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని తరలించేందుకు కార్మికులు ఉదయాన్నే చీపుర్లు, పారలు, ఇతర సామగ్రితో బయల్దేరి వెళ్తున్నారు. వీరితో పాటే స్వచ్ఛ ఆటోల సిబ్బంది కేటాయించిన ప్రాంతాలకు తరలివెళ్తుంటారు. దీనికి తోడు డ్రైనేజీల్లో పూడికతీత, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారాన్ని ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా తొలగిస్తున్నారు. పారిశుద్ధ్యం దిగజారిన ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేయడం వంటి పనులూ కొనసాగిస్తున్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా ఎంతో ప్రాధాన్యం ఉన్న పనులకు తగినంత మంది కార్మికుల్లేకపోవడం, కొత్తగా పోస్టులు నియమించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఓ వైపు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు భారీగా పెరిగాయి. శివారు కాలనీలు అంతకంతకూ విస్తరిస్తున్నాయి. ఇప్పటి అవసరాలకు తగినట్లు కార్మికుల నియామకాలు మాత్రం జరగడం లేదు. ఫలితంగా ఉన్నవారిపైనే ఎంతో భారం పడుతోంది. ప్రతి 10 వేల మంది జనాభాకు 28 పారిశుద్ధ్య కార్మికులు ఉండాలన్నది నిబంధన. కానీ క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే అరకొర సిబ్బంది.. వారూ ప్రైవేటు కూలీలే కావడం గమనార్హం. రెగ్యులర్ కార్మికుల్ని కార్యాలయాల్లోని పనులకు, జవాన్లుగా, స్వచ్ఛ వాహనాల నిర్వహణ పర్యవేక్షకులు.. డ్రైవర్లుగా, తాగునీటి సరఫరా తదితర విభాగాల్లో వినియోగించుకుంటున్నారు. పూడికతీత, చెత్త తరలింపు వంటి పనులకు మాత్రం రోజువారీ కూలీలను వాడుతున్నారు. ఒక నగరపాలకం, ఏడు పురపాలకాల్లో కలిపి మొత్తం 1,427 మంది పారిశుద్ధ్య పనులు చేపడుతుండగా.. అదనంగా మరో 840 మందిని నియమించాలని అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.'జనాభా ప్రాతిపదికన పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది నియామకంపై ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేసినట్లు' పలు పురపాలకాల కమిషనర్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

అందుబాటులో ఉన్నవారితో విధులు

జి.రఘు, కమిషనర్, కొత్తగూడెం పురపాలకం

ప్రస్తుతం 2011 జనాభా ప్రతిపాదికన నియమించిన పోస్టులే కొనసాగుతున్నాయి. అందుబాటులో ఉన్న పారిశుద్ధ్య కార్మికులతో పనిచేయిస్తున్నాం. 'పట్టణ ప్రగతి', 'హరితహారం' వంటి ప్రత్యేక సందర్భాల్లో ఏమైనా పనులుంటే స్థానిక గుత్తేదారులకు అప్పగిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతాం. అధికారులు ఆదేశిస్తే ప్రస్తుత జనాభాకు అనుగుణంగా పట్టణంలో అదనపు కార్మికులు, సిబ్బంది నియామకాలు చేపడతాం.

# తీరు మారలే.. నేరాలు తగ్గలే



కొత్తగూడెం కొత్తగూడెంలో పూటుగా తాగిన ఓ వ్యక్తి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల వేళ కానిస్టేబుల్‌తో గొడవపడ్డాడు. అతడు చేసిన దాడిలో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. అల్లరి మూకలు సిబ్బందిపై దాడులకు తెగబడేందుకూ వెనుకాడటం లేదని ఈ సంఘటన స్పష్టం చేస్తోంది.'సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసే బాలికలు, యువతుల చిత్రాలను కొందరు యువకులు అసభ్యంగా మార్ఫింగ్ చేసి వేధింపులకు పాల్పడుతున్నారు. ఆ చిత్రాలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ పైశాచికానందం పొందుతున్నారు. మరికొందరు బాలికల నంబర్లు సేకరించి ప్రేమ పేరుతో లోబర్చుకుంటున్నారు. ఈ తరహా ఘటనపై ఇటీవల కొత్తగూడెం, పాల్వంచ స్టేషన్లలో ఎక్కువగా పోక్సో కేసులు నమోదవుతున్నాయి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నేర సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఓ వైపు శాంతి భద్రతలపై రాజీ పడేది లేదని ఇటీవల సమీక్షలో జిల్లా ఎస్పీ వినీత్ స్పష్టం చేశారు. కానీ క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా నేర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు వంటి పట్టణాల్లో అల్లరి మూకలు పేట్రేగిపోతున్నాయి. ఎక్కువగా గంజాయి మత్తులో సృష్టిస్తున్న అలజడులే ఎక్కువ. నిందితులూ యువతే కావడం గమనార్హం. కొందరు ముఠాలుగా ఏర్పడి అర్ధరాత్రుళ్లు రహదారులపై సంచరించడం.. విచక్షణ కోల్పోయి పరస్పర ఘర్షణలకు పాల్పడటం షరామామూలైంది. దాడులు, హత్యాయత్నాల ఘటనలపై నమోదైన కేసులే ఇందుకు ఉదాహరణ. ఈ తరహా గొడవలకు మద్యం గొలుసుకట్టు దుకాణాలూ అడ్డాలుగా మారాయి. 'గూడెం'లో ఇటీవల ఓ గ్యాంగ్ మత్తులో చెలరేగి కానిస్టేబుల్‌నే కొట్టడం నివ్వెబోయేలా చేసింది. దొంగలూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఏడునెలల వ్యవధిలోనే అత్యధిక చోరీ కేసులు నమోదయ్యాయి. 'మేమున్నామంటూ' గొలుసు దొంగలు (చైన్‌స్నాచర్లు) ఇటీవల రెండు చోట్ల హల్‌చల్ సృష్టించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు బ్లాక్‌స్పాట్స్ గుర్తిస్తాం. అల్లరిమూకల చేష్టల కట్టడికి ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించాం. అవసరమైతే రౌడీషీట్లు తెరుస్తాం. చోరీలు కట్టడి చేస్తాం..

వినీత్, ఎస్పీ భద్రాద్రి కొత్తగూడెం

రహదారులు రక్తమోడుతున్న వేళ..జిల్లా రహదారులు రక్తసిక్తంగా మారుతున్నాయి. బూర్గంపాడు, పాల్వంచ కేఎస్ఎం, అశ్వారావుపేట సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు యువత దుర్మరణం పాలయ్యారు. ద్విచక్రవాహనంపై దాబాకు వెళ్లొస్తున్న కొత్తగూడెం యువకుడు, పాల్వంచ కేఎస్ఎం వద్ద మణుగూరుకు చెందిన యువతి మృత్యువాతపడ్డారు. భారీ వాహనాల డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు గాలికొదిలేస్తుండగా.. ద్విచక్రవాహనదారులు జాగ్రత్తలు పాటించడం లేదు. దీంతో ఏమాత్రం తేడావచ్చినా ప్రమాదాలు వాటిల్లుతున్నాయి. రోడ్లు రక్తసిక్తం అవుతున్నాయి. రహదారులపై కొన్నిచోట్ల విద్యుద్దీపాలు వెలగడం లేదు. అవి సరిచేయాలి. కూడళ్లలో నియంత్రణ చర్యలు చేపట్టాలి. బ్లాక్‌స్పాట్‌లు గుర్తించి.. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.

చిన్నారులపై అఘాయిత్యాలు

అభంశుభం తెలియని చిన్నారులపై అఘాయిత్యాలు ఆగడం లేదు. స్మార్ట్‌ఫోన్ల ద్వారా బాలికలను వేధిస్తున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. భద్రాద్రి జిల్లాలో పోక్సో కోర్టు ప్రారంభమైన తర్వాత ముద్దాయిలకు వేగంగా శిక్షలు పడుతున్నా.. కొందరిలో భయం అనేది ఉండటం లేదు. ఈ ఏడాది 58 పోక్సో కేసులు నమోదయ్యాయి. బాలికలకు ఆత్మరక్షణ, చెడు, మంచి స్పర్శలపై అవగాహన కలిగించాలి. స్మార్ట్‌ఫోన్ల దుష్ప్రభావాలను తెలియజెప్పాలి.

భారీగా సొత్తు మాయం

ఈ ఏడాది భారీ దొంగతనాలు చోటుచేసుకున్నాయి. సుజాతనగర్ మండల కేంద్రంలోని బంగారు దుకాణాన్ని ఓ ముఠా సినీ ఫక్కీలో దోచుకుంది. దుండగల పట్టివేత పోలీసులకు సవాల్‌గా మారింది. చుంచుపల్లి ఠాణా పరిధిలో ఇటీవల 3 కిలోల బంగారు ఆభరణాలు చోరీకి గురైన వైనంపైనా విచారణ కొనసాగుతోంది. త్రీ ఇంక్లైన్ ఏరియాలో ఓ పోలీస్ అధికారి ఇంట్లోనే భారీ చోరీ చోటుచేసుకోవడం దొంగల బరితెగింపును తేటతెల్లం చేస్తోంది. పగలూ రాత్రీ తేడాలేకుండా సామాన్యుల ఇళ్లను కొల్లగొడుతున్నారు. సమస్యాత్మక ఠాణాల పరిధిలో చోరీల కట్టడికి అధికారులు చర్యలు చేపట్టాలి. సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలి. పెట్రోలింగ్ పెంచాలి.

గతేడాది జులై నాటికి 9 హత్యలు జరిగితే.. ఈ ఏడాది ఏడు నెలలకే 15 జరిగాయి.

అత్యాచారాలకూ అడ్డుకట్ట పడటం లేదు. 2022లో మొత్తం రేప్ కేసులు 61 కాగా… ఈ ఏడాది జులై చివరి నాటికి 36 నమోదవడం ఆందోళనకరం.

దొంగతనాలు: 211

సొత్తు నష్టం: రూ.2,53,99,268

రికవరీ సొమ్ము: రూ.71,23,565

పరిష్కరించిన చోరీ కేసులు: 120

గత ఏడు నెలల్లో కేసులు

హత్యలు:15

అత్యాచారాలు: 36

దాడులు, హత్యాయత్నాలు: 435

# ఇనుప పైపులూ కదిలాయి.. రైతుల ఆశలు కూలాయి

కొత్తగూడెం : ఇటీవల కురిసిన వర్షాలకు పోటెత్తిన వరద ఎలాంటి బీభత్సాన్ని సృష్టించిందో తెలిపే చిత్రమిది. వాగుల ఒడ్డున ఉన్న పొలాలు, చేను చెలకలతో పాటు ఎత్తిపోతల పథకాలకు వరద ప్రవాహం తీరని నష్టాల్ని మిగిల్చి వెళ్లింది. ఆర్థికంగా స్థోమత లేక, ప్రభుత్వ యంత్రాంగం నుంచి తగినంత భరోసా లేక.. సీజన్ మీదపడుతున్నా ఏం చేయాలో పాలుపోని దుస్థితిలో బాధిత అన్నదాతలున్నారు. పాలేరు నియోజకవర్గంలో ఆకేరు వాగుపై 'అజ్మీరతండా ఫేజ్1, 2' ఎత్తిపోతల పథకాలు ఇటీవల వర్షాలకు నీట మునిగాయి. నాలుగు భారీ మోటార్లు పనికిరాకుండా పోయాయి. వాటికి బిగించిన భారీ ఇనుప పైపులు సైతం సుమారు 50 మీటర్ల దూరం కొట్టుకుపోవడం నష్ట తీవ్రతను తెలియజేస్తోంది. వాగు పొడవునా ఒడ్డున ఉన్న సారవంతమైన భూములు కొట్టుకుపోయాయి.

# మోరంచపల్లి.. గట్టెక్కే మార్గమిది!

జయశంకర్ :వరద సృష్టించిన బీభత్సం జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ప్రజలు సర్వస్వం కోల్పోయారు. మోరంచ వాగుతో ఈ గ్రామానికి భవిష్యత్తులోనూ ముంపు పొంచి ఉంది. ఏటా ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతుకుతున్నామని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. తమకు శాశ్వత పరిష్కారం చూపించాలని వేడుకుంటున్నారు..

ఆ రోజు లెక్క.. 1.44 లక్షల క్యూసెక్కులు

మోరంచపల్లి వద్ద నిర్మించిన రెండు వంతెనల ద్వారా 60 వేల క్యూసెక్కుల లోపు వరద మాత్రమే ప్రవహిస్తుంది. గత నెల 27వ తేదీన ఏకంగా 1.44 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చిందని అంచనా. వరద ఉద్ధృతి ఎక్కువ కావడంతో బయటకు వెళ్లలేక ప్రవాహం దిశ మార్చుకుని గ్రామంపైకి వచ్చింది.

వంతెనలు చిన్నవి కావడంతోనే..

మోరంచపల్లి సమీపంలో వాగుపై నిర్మించిన వంతెన చిన్నగా ఉంటుంది. గతంలో ఉన్న రోడ్డుకంటే జాతీయ రహదారి 353సి ని ఆరడుగులపైగా ఎత్తు పెంచారు. దీంతో పైనుంచి వచ్చిన వరద.. వంతెన, రోడ్డు వైపు పోటెత్తి మోరంచపల్లి వైపు మరలుతుంది. వంతెన ఎత్తుగా, రోడ్డు కిందకు ఉన్నా ఇంత ప్రమాదం జరిగి ఉండేది కాదు. గతంలో వంతెన కాకుండా రోడ్‌డ్యాం ఉండేది. ఎంత వరద వచ్చినా సాఫీగా వెళ్లేదని.. వంతెనను చిన్నగా నిర్మించడంతో ఈ సమస్య తలెత్తిందని గ్రామస్థులు చెబుతున్నారు. దీనికి సమీపంలోనే మరో చిన్న వంతెన కూడా ఉంది. గతంలోనే ఈ రెండింటిని కలిపి పెద్దగా నిర్మించి ఉంటే మోరంచపల్లికి వరద వచ్చేది కాదని వివరించారు.

ఇలా చేస్తే మేలు..

ప్రస్తుతం ఉన్న రెండు వంతెనలు కలిపి ఒకటే పెద్దగా నిర్మించాలి.

ప్రస్తుతం ఉన్నదాని కంటే ఎత్తుగా, పిల్లర్లు వేసి నిర్మాణం చేయాలి.

వరద గ్రామంలోకి రాకుండా కరకట్టలు నిర్మించాలి.

లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.

వరద అంచనా వేయడానికి గేజ్ లెవల్‌ను ఏర్పాటు చేయాలి.

వంతెన ఎత్తు పెంచాలి

మోరంచ వాగుపై ఉన్న వంతెన ఎత్తు తక్కువ ఉండటంతో గ్రామం వరద బారినపడింది. పైన ఉన్న గణపురం, రామప్ప చెరువులు మత్తళ్లు పోసినా.. అటువైపుగా ఉన్న చెరువులు ఎప్పుడు కట్టలు తెగినా మోరంచపల్లికి తీవ్ర నష్టం తప్పదు. ఈసారి 10 అడుగులకు పైగా ఎత్తులో వరద వచ్చింది. మోరంచవాగుపై నిర్మించిన వంతెన చిన్నగా ఉండటమే దీనికి కారణం. మోరంచవాగుపై ఉన్న వంతెనను ఎత్తు పెంచి, పెద్దగా నిర్మించడమో లేదా గ్రామస్థులను సురక్షిత ప్రాంతానికి తరలించడమో సత్వరమే చేయాలి.

బండ లింగారెడ్డి

సురక్షిత ప్రాంతానికి తరలించాలి

మోరంచ వాగు ఉప్పొంగి మా ఊరు కొట్టుకుపోయింది. ఇదే మొదటిసారి కాదు.. గతంలోనూ ఇలాగే జరిగింది. మోరంచపల్లిని సురక్షిత, ఎత్తైన ప్రాంతానికి తరలించాలి.

ములకనూరి రాజు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

మోరంచపల్లి వాసుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ఆరోజు అధిక వర్షాలు కురవడం, ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద రావడంతో ప్రమాదం సంభవించింది. ఆనాడు తెల్లవారుజామున 3:30 గంటలకు పోలీసులు పెట్రోలింగ్‌కు వెళ్లినప్పుడు ఎలాంటి వరద లేదు. 4 గంటలకు వరద ఆకస్మాత్తుగా గ్రామాన్ని ముంచెత్తింది. ఇక్కడ లోతట్టు ప్రాంతాల్లోని చెంచు కాలనీ వాసులు రెండు పడక గదుల ఇళ్లు కావాలని అడిగారు. వారికి కేటాయిస్తాం. ఇంకా ఎవరైనా అక్కడి నుంచి వెళ్లాలనుకునే వారు మా దృష్టికి తీసుకురావొచ్చు. ఊరిని ఖాళీ చేయించడం అంటే ఇళ్లు ఒకటే ఇస్తే సరిపోదు. వారికి ఉపాధి, జీవించడానికి కావాల్సిన ఇతర అవసరాలు కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఇటీవల కేంద్ర బృందం గ్రామాన్ని, అక్కడి వాగుపై నిర్మించిన వంతెనను సందర్శించింది. బాధితులు వారి సమస్యలను బృందం దృష్టికి తీసుకెళ్లారు.భవేశ్ మిశ్రా, కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా

# నలుచెరగులా రవాణా కష్టాలు

జయశంకర్ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పోటెత్తిన వాగులు జాతీయ రహదారులను ముంచెత్తాయి. ఫలితంగా పలుచోట్ల ఛిద్రమయ్యాయి. ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. జాతీయ రహదారి ఎక్కితే రయ్ మంటూ సాగే వాహనాలు ఆచితూచి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యం వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో వీలున్న చోట తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు.ఇది తెలంగాణ–మహారాష్ట్రలను కలిపే 353సి జాతీయ రహదారి. కాళేశ్వరం వద్ద గోదావరిపై నిర్మించిన అంతర్రాష్ట్ర వంతెనతో రాకపోకలు మరింత పెరిగాయి. కాళేశ్వరం–మహదేవపూర్ మధ్య ఇలా గుంతలు ఏర్పడ్డాయి. 16 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. కుదురుపల్లి వద్ద వంతెన దెబ్బతిని ప్రమాదకరంగా మారింది.

మహబూబాబాద్ పట్టణ సమీపంలోని మున్నేరువాగు ఉద్ధృతికి గత నెల 28న వంతెన సమీపంలో 118/200 కల్వర్టు బాక్స్ వద్ద జాతీయ రహదారి 365 దెబ్బతింది. ఒకవైపు కల్వర్టు కొట్టుకుపోయింది. 150 మీటరు దూరం వరకు ధ్వంసమైంది. తాత్కాలిక మరమ్మతులు చేశారు.ఉమ్మడి వరంగల్ జిల్లా మీదుగా 353సి, 163, 365, 365ఎ, 365బి, 563 జాతీయ రహదారులు వెళ్తున్నాయి. నిత్యం దాదాపు 5 నుంచి 8 వేల వాహనాలు నడుస్తాయి. లక్ష మందికిపైగా వినియోగిస్తారు. వీటి విస్తరణ పనులు సైతం పలుచోట్ల ప్రారంభమయ్యాయి.ప్రతిపాదనలు రూపొందిస్తాం : విద్యాసాగర్, ఈఈ, జాతీయ రహదారులు

వరదల వల్ల పలుచోట్ల జాతీయ రహదారులు దెబ్బతిన్నాయి. దాదాపు 7 చోట్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. తాత్కాలికంగా మరమ్మతులు చేశాం. ఇటీవల వరద ప్రాంతాల్లో కేంద్రం బృందం పర్యటించింది. అందులో జాతీయ రహదారుల ఉన్నతాధికారులున్నారు. ఇక్కడి పరిస్థితులు తెలుసుకున్నారు. శాశ్వత పరిష్కారం కోసం ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తాం. నిధులు రాగానే పనులు చేపడతాం.వ్యయప్రయాసాలకు గురవుతున్నాం..

గోవిందరావుపేట మండలం పస్రా గ్రామ పొలిమేరలోని గుండ్లవాగు వంతెనపై పగుళ్లు వచ్చాయి. దీంతో జాతీయరహదారిపై ఆర్టీసీ బస్సుల రాకపోకలను పస్రా గ్రామం వరకే పరిమితం చేశారు. ఏటూరునాగారం, మంగపేట మండలాలకు వెళ్లే ప్రయాణికులు పస్రా వరకు ప్రైవేటు వాహనాల్లో వచ్చి అక్కడ దిగి మళ్లీ ఆర్టీసీ బస్సెక్కి వరంగల్‌కు వెళుతున్నారు. గుండ్లవాగు వంతెన ఆవలికి 10 ఖాళీ ఆర్టీసీ బస్సులను పంపి వాటిలోనే చేరిస్తే బాగుంటుంది.

# మొరాయిస్తున్న ప్రగతి రథం

వరంగల్ : 'ఇటీవల రాత్రి సమయంలో వరంగల్ రీజియన్‌కు చెందిన రాజధాని బస్సు హనుమకొండ నుంచి ఉప్పల్‌కు వెళుతుండగా మధ్యలో బ్రేక్ డౌన్ అయ్యింది. దీంతో ప్రయాణికులు బస్సు దిగి చలిలో చాలా సేపు వేచి చూశారు. తర్వాత మరో బస్సులో అగచాట్లు పడుతూ గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. వరంగల్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఏసీ బస్సుల నుంచి మొదలుకొంటే పల్లెవెలుగు సర్వీసుల వరకు తరచూ బ్రేక్‌డౌన్‌కు గురవుతున్నాయి. ఆర్డినరీ బస్సులు నిబంధనల ప్రకారం 7 లక్షల కిలోమీటర్లు తిరగాలి. రహదారులు బాగున్నాయనే కారణంగా 13 లక్షల కిలోమీటర్ల వరకు నడుపుతున్నారు. ఏసీ బస్సులు ఆరున్నర లక్షల కిలోమీటర్ల వరకు తిరగొచ్చు. ఇవి అదనంగా 3 లక్షల కిలోమీటర్లు నడుపుతున్నారు. దీంతో బస్సుల్లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. గమ్యస్థానాలకు చేరకుండానే మార్గమధ్యంలో బ్రేక్ డౌన్ అయ్యి ఆగిపోతున్నాయి. ఇంజిన్ సహకరించక కొన్ని చాలా నిదానంగా నడుస్తున్నాయి. వరంగల్ రీజియన్‌లో అన్ని సర్వీసులు కలిసి మొత్తం 924 ఉండగా.. వీటిలో 40 శాతం బస్సులు కాలం చెల్లినవే ఉన్నాయని సమాచారం. ఐదేళ్ల నుంచి బస్సుల మరమ్మతుకు సంబంధించి విడిభాగాల సరఫరా లేకపోవడం వల్ల ఈ సమస్య తీవ్రతరం అవుతోందని తెలిసింది.

'మా కుటుంబసభ్యులం హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు రాజధాని బస్సులో ప్రయాణిస్తుండగా అనేక మార్లు మొరాయించింది. ఇందులో ప్రయాణిస్తున్న మహిళలు, చిన్న పిల్లలు ఇబ్బంది పడ్డారు. వెంటనే



చర్యలు తీసుకోండి'గత నెల 10న రామారావు అనే ప్రయాణికుడు ట్విట్టర్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు చేసిన ట్వీటు

'తొర్రూరు మహబూబాబాద్ మధ్యలో ప్రయాణిస్తుండగా, మదనతుర్తి దగ్గర బస్సు రాడ్డు విరిగింది.. తర్వాత వేరే బస్సులో కండక్టర్ తమను పంపించారు.. ప్రయాణికుల ప్రాణాలపై ఆర్టీసీకి చిత్తశుద్ధి లేదు... ' అని ఓ ప్రయాణికుడు ఇటీవల ట్విట్టర్ ద్వారా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు." ఇవీ కొన్ని ఉదాహరణలు మహబూబాబాద్ డిపో బస్సు ప్రయాణికులతో వెళుతుండగా ఒక్కసారిగా స్టీరింగ్ ఊడిపోయి ంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ర్సంపేట డిపోకు చెందిన మెట్రో సర్వీసులు 17 ఉండగా, ఇవి తరచూ మొరాయిస్తుండడంతో వాటిని వెనక్కి పంపేశారు. వీటి స్థానంలో 9 ఎక్స్‌ప్రెస్ బస్సులను వరంగల్ 1 డిపో నుంచి కేటాయించారు .హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ఏసీ బస్సులో జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ సమీపంలో మంటలు చెలరేగడంతో బతుకుజీవుడా అంటూ ప్రయాణికులు దిగి వెళ్లిపోయారు.

పరకాల వద్ద ఒక బస్సు బ్రేక్‌డౌన్ కాగా, అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లింది.ఎలక్ట్రిక్ బస్సులు లేనట్టేనా?

వరంగల్ నగరంలో తిరిగే లోకల్ బస్సులు కూడా కాలం చెల్లినవే ఉన్నాయి. రెండేళ్ల కిందటే నగరంలో తిప్పేందుకు కొత్త ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయని అప్పటి అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతున్నాయి ఓరుగల్లుకు ఒక్కటి కూడా రాలేదు. ఇటీవల పెద్ద సంఖ్యలో కొత్త సూపర్ లగ్జరీ బస్సులు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కాగా వరంగల్ రీజియన్‌కు ఆరు కేటాయించారు. బస్సుల కొరతను ఇవి ఏమాత్రం తీర్చలేవు.

ఎప్పటికప్పుడు పరిశీలించాలి

ప్రతీరోజూ షిప్టుల వారీగా బస్సులను డిపో మెకానికల్ సిబ్బంది పరిశీలించాకే డ్రైవర్‌కు అప్పగించాలి. డ్రైవర్ సైతం బస్సు స్థితిని డిపోలోనే సరిచూసుకోవాలి. సిబ్బంది నామమాత్రంగా సరిచూసి బస్సులను బయటకు పంపడంతో అవి మార్గమధ్యలో మొరాయిస్తున్నాయి.35 కొత్త బస్సులు వస్తున్నాయిజె.శ్రీలత, రీజనల్ మేనేజర్, వరంగల్‌కొత్త సూపర్ లగ్జరీ బస్సులు మొత్తం 35 రానున్నాయి. బ్రేక్ డౌన్ సమస్య తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఎలక్ట్రికల్ వాహనాలపై సమీక్షించాల్సి ఉంది.

# విద్యుత్తు బిల్లులతో గగ్గోలు

ఖమ్మం : వినియోగదారులకు విద్యుత్తు సంస్థ షాక్ ఇచ్చింది. ఈనెల జారీ చేసిన బిల్లుల్లో 'ఏసీడీ డ్యూ' పేరిట రూ.వేలల్లో ఛార్జీలు వేయడంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెలా వచ్చే బిల్లుతోపాటు అదనంగా వీటిని విద్యుత్తు సంస్థ అధికారులు చేర్చారు. ఏసీడీ అంటే ఏమిటి, ఇది ఎందుకు వేశారో తెలియక వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

వినియోగదారుల్లో ఆందోళననెలవారీ వాడకానికి రూ.100ల్లో బిల్లు వస్తే ఏసీడీ డ్యూ రూ.100 నుంచి రూ.వేలల్లో వచ్చాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా వక్రమార్గంలో తమ నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తరకం ఛార్జీలు తాము ఎందుకు చెల్లించాలని బిల్ కలెక్టర్లు, అధికారులతో వాగ్వాదాలకు దిగుతున్నారు.

జిల్లాలో...ఖమ్మం జిల్లాలో మొత్తం 6.1లక్షల విద్యుత్తు సర్వీసులున్నాయి. వీటిలో వ్యవసాయ కనెక్షన్లు 1.05లక్షలు పోను బిల్లింగ్ చేయాల్సినవి 5.05లక్షలు. గ్రామీణ ప్రాంతాల్లో రెండు నెలలకు ఒకసారి, పట్టణ ప్రాంతాల్లో ప్రతినెలా బిల్లింగ్ చేస్తారు. ప్రతినెలా 3.9లక్షల సర్వీసులకు బిల్లింగ్ చేయాల్సి ఉంది. ఈనెల తీసిన బిల్లుల్లో అధిక శాతం సర్వీసులకు ఏసీడీ డ్యూ పేరిట అదనపు బిల్లులు వచ్చాయి.

ఏసీడీ అంటే.గత ఏడాది కాలంలో వినియోగదారులు వాడుకున్న సరాసరి యూనిట్లను లెక్కించి రెండు నెలల బిల్లును డిపాజిట్గా అంటే అదనపు వినియోగ ధరావతు (అడిషనల్ కన్జమ్షన్ డిపాజిట్- ఏసీడీ) జనవరి బిల్లులో చూపించారు. దీనిని ఫిబ్రవరి బిల్లుతోపాటు చెల్లించాల్సి ఉంటుంది. ఏసీడీని తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) రెగ్యులేషన్ నంబర్-6 ప్రకారం విధించారు. వినియోగదారుడు తమ సర్వీసు తీసుకునే సమయంలో ఒక కిలోవాట్కు రూ.200 చొప్పున సెక్యూరిటీ డిపాజిట్(ఎస్‌డీ) చెల్లించాలి. తదుపరి వారు వాడుకునే యూనిట్ల ప్రకారం ఏసీడీని లెక్కిస్తారు. దీనిలోంచి ఎస్‌డీ మినహాయించి నికర మొత్తాన్ని వారి బిల్లుల్లో ఏసీడీగా చూపిస్తారు. ఈ డిపాజిట్పై ఏడాదికి ఒకసారి రిజర్వు బ్యాంకు నిర్ణయించిన రేట్ల ప్రకారం వడ్డీ లెక్కించి వినియోగదారుల బిల్లులో జమ చేస్తారు.

# ఆశలు ఆవిరై.. ఆవేదన మిగిలి!!



జయశంకర్ :రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఎడ్‌సెట్-2023లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. కాకతీయ విశ్వవిద్యాలయం లోని క్యాంపస్ విద్యా కళాశాలలో ప్రవేశాలు పొందారు. తమకు ఉత్తమ బోధన అందుతుందని ఆశపడ్డారు. ఎంతో నైపుణ్యం కలిగిన అధ్యాపకులు ఉంటారని ఊహించారు. కళాశాలలో అడుగిడిన వారికి అసలు విషయం బోధపడింది. ఉత్తమ ప్రమాణాలతో కూడిన మాట ఉత్తదేనని. ఆశలు ఆవిరై ఆవేదన మిగిలింది. వసతి లేక అరకొర బోధనతో విద్యార్థులు బావురుమంటున్నారు. క్యాంపస్‌లోని కేయూ బీఈడీ కళాశాలలో ఉపాధ్యాయ విద్యకు చెదలు పట్టిందనే విషయాన్ని గ్రహించారు.

భర్తీ కాని సీట్లు 2022-24 విద్యా సంవత్సరానికి ఎడ్‌సెట్-2022 ద్వారా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రవేశాలు నిర్వహించింది. గతేడాది నవంబరులో సీట్ల భర్తీ ప్రక్రియ ముగిసింది. 100 సీట్లు అందుబాటులో ఉండగా 66 మాత్రమే భర్తీ అయ్యాయి. కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అన్నట్లు సీట్ల భర్తీ కాకపోవడానికి ఎన్నో కారణాలు ఉన్నాయని అధ్యాపకులు అంటున్నారు.రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడం, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు కావడం, హాస్టల్ వసతి లేకపోవడం తదితర కారణాలతో సీట్లు భర్తీ కాలేదు.

రెగ్యూలర్ అధ్యాపకుల కొరత బోధన కళాశాలను అధ్యాపకుల కొరత పట్టిపీడిస్తోంది. 15 సంవత్సరాల నుంచి కేయూలో అధ్యాపక భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి నిబంధనల ప్రకారం ప్రిన్సిపల్‌తో సహా 16 మంది అధ్యాపకులు ఉండాలి. ప్రస్తుతం రెగ్యులర్ అధ్యాపకులు ఒక్కరూ లేరు. సరిపడా భవనాలు, మౌలిక సౌకర్యాలు ఉన్నాయి. కానీ కేవలం ఐదుగురే బోధిస్తున్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ రణధీర్‌రెడ్డి మినహా మిగిలిన నలుగురు తాత్కాలిక అధ్యాపకులు.

అరకొర బోధన

గత ఏడాది నవంబరు 14 నుంచి బోధన మొదలైంది. రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు బోధన గాడిలో పడలేదు. అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. 16 మందికి గానూ ఐదుగురు మాత్రమే తరగతులు బోధిస్తున్నారు. సిలబస్ ముందుకు కదలడం లేదు. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో సరిగా హాజరు కాలేకపోతున్నారు. కేవలం 10 మంది మాత్రమే హాజరవుతున్నట్లు అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీసీలు ఇవ్వండి సార్

సెల్ఫ్ ఫైనాన్స్ కింద బీఈడీ నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించలేమని విశ్వవిద్యాలయ అధికారులు తేల్చి చెప్పారు. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఒక వైపు అరకొర బోధన మరోవైపు వసతి, భోజన సౌకర్యం కల్పించకపోవడంతో విద్యార్థుల్లో నిరాశ నిస్పృహలు నెలకొన్నాయి. సౌకర్యాలు కల్పించాలి లేదా టీసీలు ఇచ్చి పంపించాలని కోరుతున్నారు.

ఇప్పటికే ఎంఈడీ కోర్సు రద్దు..సరిపడా అధ్యాపకులు లేకపోవడంతో కోర్సు నిర్వహణ కష్టంగా మారింది. అధ్యాపక నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదు. వసతికి సరిపడా భవనాలు లేవు. కోర్సు నిర్వహణపై నీలి నీడలు అలుముకున్నాయి. జాతీయ విద్యా ఉపాధ్యాయ మండలి (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం అధ్యాపకులు లేరని ఇప్పటికే ఈ కళాశాలలో ఎంఈడీ కోర్సుకు అనుమతి రద్దు చేశారు. ఈసారి జరిగే ఎన్‌సీటీఈ సమావేశంలో బీఈడీ కోర్సుపైనా చర్చించే అవకాశాలు ఉన్నాయని పలువురు అంటున్నారు. మరో పదకొండు మందిని నియమించకుంటే బీఈడీ అనుమతి కూడా రద్దు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాత్కాలిక పద్ధతిలోనైనా 11 మంది అధ్యాపకులను నియమించాల్సిన అవసరం ఉంది. లేకుంటే కేయూ బీఈడీ కళాశాల మనుగడ కష్టంగా మారుతుంది.

# వైద్యుల కొరత.. కార్మికుల వెత



జయశంకర్ : కేటీకే 5వ గనికి చెందిన ఓ కార్మికుడు కడుపు నొప్పితో ఏరియా ఆసుపత్రికి వచ్చాడు. అతనికి ప్రథమ చికిత్స చేసి సమస్య తెలుసుకునేందుకు వైద్యుడు స్కానింగ్ చేయించుకోవాలని చెప్పడంతో ఆ కార్మికుడు ప్రైవేటుకు వెళ్లి సొంత ఖర్చులతో స్కానింగ్ చేయించుకున్నాడు.గుండె సంబంధిత సమస్యలున్న కార్మికులను హనుమకొండ, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. వైద్యం అందడానికి కనీసం 2 గంటల నుంచి 4 గంటల సమయం పడుతోంది. ఈ లోపు ప్రాణాపాయం జరుగుతుందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కార్పొరేట్‌లో బిల్లులు భారీగానే అవుతున్నాయి.

కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వైద్యం అందించేందుకు సింగరేణి ప్రధాన, ఏరియాల ఆసుపత్రులు, డిస్పెన్సరీలను ఏర్పాటు చేసింది. ఆయా ఆసుపత్రుల్లో వైద్య నిపుణులు లేక కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. భూపాలపల్లి ఏరియా ఆసుపత్రిలోనూ అదే పరిస్థితి నెలకొంది. భూపాలపల్లి ఏరియాలో 5,422 మంది సింగరేణి కార్మికులు, ఉద్యోగులున్నారు. స్థానికంగా ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. ఇక్కడికి రోజుకు 200 నుంచి 230 మంది వరకు వైద్యం కోసం వస్తారు. చాలా కాలంగా సింగరేణి ఏరియా ఆసుపత్రుల్లో సరిపడా వైద్య నిపుణులు లేరు. మెరుగైన వైద్యం కోసం ప్రధాన ఆసుపత్రులైన కొత్తగూడెం, గోదావరిఖనికి పంపిస్తున్నారు. అక్కడ సైతం వైద్య నిపుణుల కొరతతో కార్పొరేట్ ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నారు. భూపాలపల్లి ఆసుపత్రిలో జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, గైనకాలజిస్టు, ఆర్థో, అనస్తీషియా, జనరల్ ఫిజిషియన్, తదితర 9 మంది వైద్య నిపుణులున్నారు. ఇంకా చర్మ, పిల్లలు, డెంటల్, కంటి, రేడియాలజిస్టు, ఛాతి, సంబంధిత వైద్య నిపుణులు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. కార్మికులు దుమ్ము, ధూళీ ప్రాంతాల్లో పని చేస్తుంటారు. కళ్లకు, ఛాతికి సబంధించిన సమస్యలు ఎదురవుతున్నాయి. ఇక్కడ మాత్రం ఆయా నిపుణులు లేరు. ఇక్కడ నెలకు 25 నుంచి 30 ప్రసవాలు జరుగుతున్నాయి. పిల్లల వైద్య నిపుణులు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. కార్మికులు బీపీ, షుగర్‌తో పాటు ఎక్కువగా హృద్రోగ సమస్యలు ఎదుర్కొంటున్నారు. గుండె సంబంధిత సమస్యలను చూపించుకోవడానికి సైతం ప్రైవేటుకే వెళ్లాల్సి వస్తోంది.

స్కానింగ్‌కు ప్రైవేటుకే..

కార్పొరేట్‌ను తలపించే పెద్ద ఆసుపత్రిలో అన్ని వసతులున్నా స్కానింగ్ సదుపాయం లేకపోవడంతో సమస్యగా మారింది. కడుపు నొప్పితో వచ్చే వారికి స్కానింగ్ చేయాలన్నా ప్రైవేటులో చేయించుకుని రావాలని వైద్యులు సూచిస్తున్నారు. గర్భిణులకు సైతం కడుపులో పిండం ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు స్కానింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ, ఏరియా ఆసుపత్రిలో స్కానింగ్ సౌకర్యం లేక ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలకు వెళ్తున్నారు. వైద్యులు సూచించినప్పుడు మాత్రమే సింగరేణి ఆ బిల్లులు చెల్లిస్తోంది. ఏదైనా సందేహం వచ్చి చేయించుకుంటే కార్మికులే సొంతంగా చెల్లించుకుంటున్నారు. రానుపోను ప్రయాణాలకు గర్భిణులు అవస్థలు పడుతున్నారు. సీటీ స్కానింగ్ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. దాదాపు 80 కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందించేందుకు సింగరేణి ఒప్పందం కుదుర్చుకుంది. కానీ, కార్మికులకు దూరభారం ఇతరత్రా సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన వైద్య నిపుణులను ఏర్పాటు చేయించాలని కార్మికులు కోరుతున్నారు.

వైద్య నిపుణలను నియమించాలి- జోగ బుచ్చయ్య, ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు

భూపాలపల్లి ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య నిపుణులను నియమించాలి. కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లలేక కార్మికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆసుపత్రిలో వసతులున్నా వైద్య నిపుణులు లేకుంటే అవన్నీ వృథానే. స్కానింగ్ కోసం కూడా ప్రైవేటుకే వెళ్లాల్సి వస్తోంది. అధికారులు వైద్య నిపుణుల నియామకం చేపట్టి సమస్యను పరిష్కరించాలి.వైద్యులు వచ్చే అవకాశం ఉంది- పద్మజ, సూపరింటెండెంట్, సింగరేణి ఏరియా ఆసుపత్రిఆసుపత్రికి వచ్చే కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య చికిత్సలు చేస్తున్నాం. కొందరు వైద్య నిపుణులు లేకపోవడంతో ప్రైవేటుకు వెళ్తున్నారు. సింగరేణిలో 27 మంది నూతన వైద్య నిపుణుల నియామకం జరుగుతోంది. ఇక్కడికి కూడా నూతన వైద్యులు వచ్చే అవకాశం ఉంది.

# 'ఉపాధి'లో అతివల పైచేయి

జయశంకర్ : పొట్టకూటికి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్తున్న కూలీలకు సొంత గ్రామాల్లోనే పని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టడంతో పేదల పాలిట వరంగా మారింది. ఉపాధి పనుల్లో మహిళలే ఎక్కువగా పని చేస్తున్నారు. పురుషులు పది మంది వస్తే మహిళలు 40 మంది వరకు వచ్చి పనులు చేస్తున్నారు. ఏపీవో దగ్గరి నుంచి టీఏ, ఎఫ్ఏలు, కంప్యూటర్ ఆపరేటర్ల వరకు మహిళలు పనిచేయడంతో ఈ పనులు చేసేందుకు వీరు ఎక్కువగా ఉత్సాహం చూపిస్తున్నారు. జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో లింగాలఘన్‌పూర్, జఫర్‌గఢ్, రఘునాథపల్లి, చిల్పూర్, స్టేషన్‌ఘన్‌పూర్ మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో 56,822 జాబ్ కార్డులు ఉన్నాయి. కూలీలు 1,20,991 లక్షల మంది ఉన్నారు. వీరిలో 60,574 మంది మాత్రమే పనులు చేసేందుకు వస్తున్నారు. ఇందులో మహిళా కూలీలు 40 వేల పైచిలుకు ఉన్నారని అధికారులు తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల్లో మహిళా కూలీల భాగస్వామ్యం ఏటా పెరుగుతోంది. ప్రతి కుటుంబంలో భార్యాభర్తలకు జాబ్ కార్డులు కలిగి ఉన్నా.. భార్యలు ప్రభుత్వం కల్పించిన వంద రోజుల పనిని పూర్తి చేస్తున్నారు. గ్రామాల్లో పురుషులు వ్యవసాయం, ఇతరత్రా వృత్తి పనులు చేస్తుండగా మహిళలకు మాత్రం ఉపాధి పనులు వరంగా మారాయి.

# చెరువుల వేలం.. అవినీతి దందా

నల్గొండ : మత్స్యశాఖలో అవినీతి అక్రమాలకు అడ్డుకట్టవేయడానికి ప్రభుత్వం ఎన్ని మార్పులు తీసుకొచ్చినా.. కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల వాటికి అడ్డుకట్ట పడటంలేదు. అవినీతి జరుగుతుందనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చెరువుల వేలం వేసే అధికారాన్ని గ్రామపంచాయతీల నుంచి నేరుగా మత్స్యశాఖకే అప్పగించింది. ఇప్పుడు ఆ శాఖ అధికారులు గుత్తేదారులతో కుమ్మక్కై తక్కువ ధరకు చెరువులను కట్టబెడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతుంది.నల్గొండ జిల్లాలో 215 ప్రభుత్వ చెరువులున్నాయి. వీటిలో చేపల పెంపకానికి వేలంలో జరుగుతున్న అక్రమాలను అరికట్టడానికి ప్రభుత్వం జీవోనెం. 268 ప్రకారం చెరువులు, కుంటలను గ్రామపంచాయతీల నుంచి మత్స్యశాఖ పరిధిలోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునేందుకు వీటి వేలం నిర్వహించి లీజుకు ఇచ్చే బాధ్యత ఆశాఖకే అప్పగించింది. అయితే.. ఆశాఖ అధికారులు గుత్తేదారులతో కుమ్మక్కుతో తక్కువ ధరకు కట్టబెడుతున్నారు. ఇప్పటికే నాసిరకమైన చేపపిల్లల పంపిణీ, తప్పుడు లెక్కలతో అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇక చెరువుల వేలంపాట విషయంలోనూ అదే తీరు కొనసాగుతోంది.

ఇవీ అక్రమాలు.. ఇటీవల నల్గొండ మండలం వెల్లుపల్లి చెరువు వేలం పాట జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో నిర్వహించారు. గతంలో గ్రామపంచాయతీ వేలం నిర్వహించినప్పుడు రూ.4.50 లక్షలకు ధర నిర్ణయించగా.. అదే చెరువుకు వారం క్రితం చెరువు వేలం మత్స్యశాఖ వేయగా.. కేవలంరూ.5040కే గుత్తేదారుకు కేటాయించారు. ఇందులో ఓ గుత్తేదారు అధికారులను మచ్చిక చేసుకుని తక్కువ పదుల సంఖ్యలో వచ్చిన గుత్తేదారులతో సిండికేట్ అయి ఒకే గుత్తేదారులు వేలంలో పాల్గొనేలా చేసి తక్కువ ధరకు సొంతం చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. దాదాపు రూ.2 లక్షల వరకు చేతులు మారినట్లు సమాచారం. వేలంలో ఆశించిన స్థాయిలో ఆదాయం రాకుంటే దానిని వాయిదా వేసి పలువురి సమక్షంలో మళ్లీ నిర్వహించాల్సి ఉన్నా.. ఆ నిబంధనలు ఆశాఖ అధికారులు పట్టించుకోలేదు. ఈ వేలాన్ని రద్దుచేయాలని స్థానిక సర్పంచి ఈగల శైలజతో పాటు స్థానికులు కోరుతున్నా అధికారులు నిర్లక్ష్యం వీడట్లేదు. మిర్యాలగూడ డివిజన్ పరిధిలో ఓ చెరువు వేలం పాట గతంలో రూ.లక్షల్లో లీజుకు పోగా శాఖ పరిధిలో వేసిన వేలంలో మాత్రం రూ.వేలకు ఖరారు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితులే ఉన్నా.. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవట్లేదు.

కలెక్టర్‌కు నివేదిక..వెంకయ్య, జిల్లా అధికారి, మత్స్యశాఖ

జిల్లాలో చాలా చెరువుల వేలంలో తక్కువ ధరకే పాడుతున్నారు. దీంతో ఆదాయం తగ్గుతుంది. వెల్లుపల్లి చెరువు వేలం కార్యాలయంలో నిర్వహించాం. ఒక్కరే పాల్గొనడంతో తక్కువ ధరకు ఇవ్వాల్సి వచ్చింది. వేలం పాటలపైన కలెక్టర్‌కు నివేదిక పంపుతాం. ఆయన ఆమోదం తర్వాతనే చెరువులు గుత్తేదారులకు కేటాయిస్తాం.

# సలహాలు ఇస్తూ.. సాగుకు సహకరిస్తూ..

భువనగిరి : అన్ని శాఖలకంటే వ్యవసాయ శాఖ ఎంతో కీలకం..అన్నదాతలు నష్టపోకుండా అదనులో సాగు సలహాలు అందితే అధిక దిగుబడి సాధించేందుకు ఉపకరిస్తుంది. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల పాత్రను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం 2017లో క్లస్టర్ల వారీగా వ్యవసాయ విస్తరణాధికారులను నియమించింది. జిల్లాలో 92 క్లస్టర్లకు గాను 92 మంది విస్తరణాధికారులు నియామకమయ్యారు. ఇందులో 33 మంది యువతులు ఉండటం విశేషం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లా అధికారులు అప్పగించిన పనులను పురుషులతో సమానంగా క్షేత్ర స్థాయిలో నిర్వహించడంలో మహిళా విస్తరణాధికారులు పట్టు సాధిస్తున్నారు. క్రాప్, రైతు సమగ్ర సర్వే నిర్వహించడం, రైతుబంధు, రైతు బీమా పథకాలకు అర్హులను గుర్తించడంలో విజయవంతమయ్యారు. యాసంగి, వానాకాలం పంటల సాగులో రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించడంలోనూ ముందున్నారు. క్షేత్రస్థాయిలో కష్టాలను అధిగమించి అన్నదాతలకు అండగా ఉంటున్న మహిళా విస్తరణాధికారులపై కథనం.

రైతుల ఆనందమే మాకు సంతృప్తి-ఎస్ మాధురి, హన్మాపురం, భువనగిరి మండలం

క్షేత్ర స్థాయిలో రైతులను కలిసినప్పుడు వారు మా పై ఉంచే నమ్మకం బలాన్ని చేకూరుస్తుంది. ప్రభుత్వం చేపట్టిన పథకాలకు సంబంధించి ఫలాలు రైతు అందుకున్నప్పుడు వాళ్ల కళ్లల్లో ఆనందం సంతృప్తినిస్తుంది. రైతుబంధు, రైతు బీమా పథకాల కోసం అర్హులను గుర్తించడంలో కొంత ఇబ్బంది జరిగినా రైతుల సహకారంతో విజయవంతంగా పూర్తి చేయగలిగాం. రైతులు రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ సాగు వైపు మళ్లేలా అవగాహన కల్పిస్తున్నాం.

అన్నం పెట్టే అన్నదాతకు..-లావణ్య, వంగపల్లి

రైతుల కోసం పని చేస్తున్నామనే సంతృప్తి ఉంది. అందరికీ అన్నం పెట్టే రైతులంటే ఇష్టంతో దీనికి సంబంధించిన చదువునే ఎన్నుకున్నాను. డిప్లొమా పూర్తి చేసిన కొంత కాలానికే తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణురాలినై ఉద్యోగం సంపాదించాను. సాగును లాభసాటిగా మార్చేందుకు నా వంతు కృషి చేస్తున్నాను.

గర్వంగా ఉంది..-ఆర్.శాలిని, గొలనుకొండ, ఆలేరు

మహిళా ఉద్యోగిగా వ్యవసాయ శాఖలో పని చేయడం గర్వంగా ఉంది. సాగులో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించేలా సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు క్షేత్రస్థాయిలో వారి పొలంలో ప్రదర్శనలు ఇచ్చి అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు నా వంతుగా లబ్ధి చేకూర్చేందుకు పని చేస్తున్నాను.

రైతుల కోసం..కె.నవనీత, గట్టుసింగారం, అడ్డగూడూరు

క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు తెలుసుకుని తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. జిల్లాలో ఎంతో మంది మహిళా ఉద్యోగులు ఉండటం వల్ల మాకు ధైర్యంగా ఉంది. వృత్తి పరమైన కొన్ని సమస్యలు ఎదురవుతున్నా రైతుల కోసం చేసే ఈ వృత్తి సంతోషాన్ని కల్గిస్తోంది. సమస్యలు తీర్చేందుకు కృషి-పి.శ్వేత, చోళ్లరామారం, అడ్డగూడూరు ప్రభుత్వం నుంచి అందే పథకాలు రైతులకు అందించడం మా ధర్మం. అవి ఒక్కోసారి ఆలస్యం జరుగుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతుంటారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ పథకం పీఎంకేవై అర్హులు కేవైసీ చేసుకోవడంలో ఆధార్ కార్డుతో బ్యాంకు ఖాతా అనుసంధానం విషయంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. వాటిని క్రమంగా పరిష్కరిస్తున్నాం.అంకితభావంతో పని చేస్తున్నారు- అనురాధ, జిల్లా వ్యవసాయాధికారిణిఏఈవోలందరికీ ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వడం వల్ల అనుభవం పొందుతున్నారు. క్షేత్రస్థాయిలో మహిళా ఏఈవోలు బాగా పని చేస్తున్నారు. పురుషులతో సమానంగా వెళ్లడం కొంత ఇబ్బందే అయినా వారికి గల సౌకర్యాల మేరకు భారం అనుకోకుండా అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారు.




మదనపల్లె : అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌యార్డులో టమాటా ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. గత నెల 30న మార్కెట్ చరిత్రలోనే కిలో టమాటా అత్యధికంగా రూ.196 పలికిన సంగతి తెలిసిందే.

గత నాలుగు రోజులుగా మార్కెట్‌కు దిగుబడి స్వల్పంగా పెరగడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. బుధవారం వరకు అత్యధికంగా కిలో టమాటా రూ.100 వరకు ఉంది. గురువారం ఈ ధరలు ఒక్కసారిగా తగ్గాయి.

ఇవాళ ఏ గ్రేడ్ కిలో టమాటా రూ.50 నుంచి రూ.64 వరకు, బీ గ్రేడ్ రూ.36 నుంచి రూ.48 వరకు ఉంది. సగటున కిలో టమాటా రూ.44 నుంచి రూ.60తో వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసినట్లు మార్కెట్ యార్డ్ కార్యదర్శి అభిలాష్ తెలిపారు.




దిల్లీ: కొలీజియం వ్యవహారంలో కేంద్రం, సుప్రీంకోర్టు మధ్య అభిప్రాయభేదాలు కొనసాగుతున్న వేళ మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి , ఎన్నికల కమిషనర్ల నియామకాలను నియంత్రించేలా కేంద్రం కొత్త చట్టం తీసుకొస్తోంది. ఇందుకు సంబంధించిన బిల్లును గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. ఈ కొత్త చట్టంతో నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని కేంద్రం తొలగించడం ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది. ప్రధాన ఎన్నికల అధికారి, ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకాలు, సర్వీసుల కండీషన్లు, పదవీకాలం) బిల్లు, 2023ను రాజ్యసభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ప్రకారం.. నియామక ప్యానెల్‌లో సీజేఐ తొలగించింది. ఎన్నికల సంఘంలో నియామకాలను త్రిసభ్య కమిటీ సిఫార్సు మేరకు రాష్ట్రపతి నియమించాలని ఈ బిల్లులో ప్రతిపాదించారు. అయితే, ఈ ప్యానెల్లో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధాని నామినేట్ చేసిన కేంద్ర కేబినెట్ మంత్రి ఒకరు సభ్యులుగా ఉండనున్నారు. ఈ ప్యానెల్‌కు ప్రధాని నేతృత్వం వహిస్తారని బిల్లులో పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించి ఈ ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఎన్నికల సంఘంలో నియామకాలను.. ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సీజేఐ సభ్యులుగా ఉన్న కమిటీనే చేపట్టాలని ఆదేశించింది. ఈ త్రిసభ్య కమిటీ చేసిన సిఫార్సుల మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి మాత్రమే నియమించాలని స్పష్టం చేసింది. అయితే, ఈసీల నియామకాల కోసం కొత్త చట్టం తీసుకొచ్చేంత వరకు ఈ త్రిసభ్య కమిటీ అమల్లో ఉంటుందని అప్పుడు సుప్రీంకోర్టు వెల్లడించింది. తాజాగా ఈ నియామకాల కోసం బిల్లును రూపొందించిన కేంద్రం.. త్రిసభ్య కమిటీలో సీజేఐను తొలగించడం చర్చనీయాంశంగా మారింది.

**పీఎం చేతిలో తోలుబొమ్మలా ఈసీ..** ఈ బిల్లుపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా ఎన్నికల సంఘాన్ని నియంత్రించాలనుకుంటున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈసీని తమ చేతిలో తోలుబొమ్మలను మారుస్తోందని దుయ్యబట్టింది. అటు ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కూడా దీనిపై విమర్శలు గుప్పించారు. ఇది అత్యంత ప్రమాదకరమైన నిర్ణయమని, ఎన్నికల పారదర్శకతపై ఇది తీవ్ర ప్రభావం చూపిస్తుందని మండిపడ్డారు.

## నేడు సీఎం వైయస్ జగన్ అమలాపురంలో పర్యటన



తాడేపల్లి: ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం (11.08.2023) డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో పర్యటించనున్నారు. వైయస్‌ఆర్ సున్నా వడ్డీ పథకం లబ్ధిదారులకు నిధులు విడుదల చేయనున్న సీఎం వైయస్ జగన్. ఉదయం 9.20 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి అమలాపురం చేరుకుంటారు.

అమలాపురం మండలం జనుపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగం అనంతరం, వైయస్‌ఆర్ సున్నా వడ్డీ పథకం లబ్ధిదారులకు నిధులు విడుదల చేయనున్న సీఎం వైయస్ జగన్, సభ అనంతరం మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి చేరుకోనున్న సీఎం.

## మహిళా పోలీసుల దుస్తులు లాగడాన్ని ఎలా సమర్థించుకుంటారు?: చంద్రబాబు



అమరావతి: అనంతపురం నగరంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) స్టేషన్‌లో వైకాపాకు చెందిన ఓ కార్పొరేటర్ వీరంగం సృష్టించడాన్ని తెదేపా అధినేత చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. మహిళా పోలీసుల దుస్తులు లాగుతూ ఈడ్చుకెళ్లడాన్ని పోలీసు పెద్దలు, పాలకులు ఎలా సమర్థించుకుంటారని నిలదీశారు. ఏపీలో పోలీసులకు కూడా రక్షణ లేని అరాచక పాలన కొనసాగుతోందని ధ్వజమెత్తారు. దాడిలో వైకాపా కార్యకర్తలతో పాటు వాలంటీర్లు కూడా పాల్గొనడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక నేరస్థుడికి అధికారం ఇచ్చినందుకు ప్రజలు భయం భయంగా బతకాల్సి వస్తోందన్నారు.

**పోలీసులకే రక్షణ లేకపోతే.. సామాన్యుల పరిస్థితేంటి?: నారా లోకేశ్**

– ఎస్ఐ కుర్చీలో కూర్చుని.. అక్రమ మద్యం కేసులో పట్టుబడిన వ్యక్తిని వదిలి పెట్టాలంటూ పోలీసులపై దుర్భాషలాడటం వైకాపా నేతల సైకోయిజానికి పరాకాష్ఠ అని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్రంగా మండిపడ్డారు.

"జగన్ పాలనలో మహిళా పోలీసులకే రక్షణ లేకపోతే ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏంటి? మహిళా పోలీసు డ్రెస్ పట్టుకొని బయటకు ఈడ్చుకెళ్లి, అడ్డొచ్చిన కానిస్టేబుల్‌ను చితకబాదిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అనుచరుడు, వైకాపా నేత సాకే చంద్రశేఖర్‌ను కఠినంగా శిక్షించాలి" అని లోకేశ్ డిమాండ్ చేశారు.




దిల్లీ: ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ ఉంచని వినియోగదారులపై బ్యాంకులు ఛార్జీలు విధిస్తాయి. దీంతో పాటు ఏటీఎం లావాదేవీ ఛార్జీలు, ఎస్సెమ్మెస్ ఛార్జీలు కూడా ఉంటాయి. ఇలా వసూలు చేసిన ఛార్జీల వివరాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రాజ్యసభలో లిఖితపూర్వకంగా తెలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పాటు ఐదు ప్రధాన ప్రైవేట్ బ్యాంకులు కస్టమర్ల నుంచి వసూలు చేసిన సొమ్ము వివరాలను వెల్లడించింది. 2018 నుంచి ఇప్పటి వరకు రూ.35,000 కోట్లకు పైగా ఛార్జీలు వసూలు చేసినట్లు అందులో తెలిపింది. ప్రభుత్వ బ్యాంకులతో పాటు యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంకుల నుంచి కనీస బ్యాలెన్స్ ఉంచని కారణంగా రూ.21,000 కోట్లు వసూలు చేసినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. ఏటీఎం లావాదేవీల కోసం రూ.8,000 కోట్లు, ఎస్సెమ్మెస్ సేవలు అందిస్తున్నందుకు రూ.6,000 కోట్లు సేకరించినట్లు అందులో తెలిపింది. కొన్ని రకాల ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ ఉంచకపోతే వాటిపై బ్యాంకులు ఛార్జీలు విధిస్తాయి. అయితే, ఈ ఛార్జీలు ప్రాంతాల వారీగా మారుతుంటాయి. నెలవారీ సగటు బ్యాలెన్స్ మెట్రో నగరాల్లో రూ.3,000 నుంచి రూ.10,000 వరకు ఉంటుంది. చిన్న నగరాల్లో రూ.2,000 నుంచి రూ.5,000 వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.500 నుంచి రూ.1,000 వరకు ఉంటుంది. అయితే, ఈ ఛార్జీలు బ్యాంకుల బట్టి మారుతూ ఉంటాయి. అయితే, ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన కింద తెరిచిన ఖాతాల్లో, బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతాలో కనీస బ్యాలెన్స్ ఉంచాల్సిన అవసరం లేదు.



## టీటీడీ చైర్మన్‌గా ఎమ్మెల్యే భూమన బాధ్యతల స్వీకరణ

అమరావతి/తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నూతన చైర్మన్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. శ్రీవారి ఆలయంలో ఉదయం 11: 44 గంటలకు టీటీడీ పాలక మండలి చైర్మన్‌గా భూమన ప్రమాణ స్వీకరం చేశారు. అనంతరం 12.30 నిమిషాలకు అన్నమయ్య భవన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 9 గంటలకు పద్మావతి పురంలోని ఇంటి వద్ద నుంచి బయలుదేరిన భూమన గ్రామ దేవత తాతయ్య గుంట గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అలిపిరి వద్ద గోపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.భూమనకు టీటీడీ జీఈవో సదా భార్గవి స్వాగతం పలికారు. అలిపిరి నుంచి తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారి ఆలయంలో ఉదయం 11: 44 గంటలకు టీటీడీ చైర్మన్‌గా భూమన ప్రమాణ స్వీకారం చేశారు. భూమన బాధ్యతల స్వీకరణ పథ్యంలో తిరుపతి నగరంలో అభిమానులు భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

## మంత్రి అమర్‌నాథ్‌కు 'జనసేన శతఘ్ని' కౌంటర్



అమరావతి: ఏపీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు 'జనసేన శతఘ్ని' టీమ్ కౌంటర్ ఇచ్చింది. మంత్రి మీడియాతో మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు 10 ప్రశ్నలు సంధించి సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శతఘ్ని టీమ్.. అమర్‌నాథ్‌కు 10 ప్రశ్నలు సంధిస్తూ ట్వీట్ చేసింది. గత నాలుగేళ్లలో అనకాపల్లి ప్రాంతానికి మంత్రి అమర్‌నాథ్ ఏం చేశారని శతఘ్ని టీమ్ ప్రశ్నించింది. కనీసం రోడ్ల నిర్మాణమైనా చేశారా? అని నిలదీసింది. మంత్రి అయ్యాక ఉత్తరాంధ్రకు ఆయన ఏం చేశారని ప్రశ్నించింది. శతఘ్ని టీమ్ పోస్ట్ చేసిన ట్వీట్‌ను జనసేన పార్టీ రీట్వీట్ చేసింది.

**మంత్రి అమర్‌నాథ్ ఏమన్నారంటే..** బుధవారం మంత్రి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగిందనే సాకుతో పవన్ కల్యాణ్ విశాఖకు వస్తున్నారని విమర్శించారు. పవన్‌కు పది ప్రశ్నలు సంధించి, వాటికి జవాబులు చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేస్తారా..? విశాఖను పరిపాలన రాజధానిగా వ్యతిరేకించడం, భాజపాతో ఉంటూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోకపోవడం తదితర అంశాలకు ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో జనసేన శతఘ్ని టీమ్ కౌంటర్ ఇచ్చింది.




ముంబయి: విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక రేట్లను యథాతథంగా కొనసాగించింది. మంగళవారం ప్రారంభమైన పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ప్రకటించారు. రెపోరేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఎంఎస్‌ఎఫ్, బ్యాంక్ రేట్ సైతం 6.75 శాతం వద్ద స్థిరంగా ఉన్నాయి. గత జూన్ సమావేశంలోనూ రెపో రేటును ఎలాంటి మార్పు చేయకుండా 6.5 శాతంగా కొనసాగించారు. వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచడం వరుసగా ఇది మూడోసారి. అంతకుముందు ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు 2022 మే నుంచి వరుసగా ఆరు దఫాల్లో రెపో రేటును 250 బేసిస్ పాయింట్ల మేర ఆర్‌బీఐ పెంచింది. ఈ సందర్భంగా గవర్నర్ శక్తికాంత దాస్ మాట్లాడుతూ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచాలని ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలిపారు. సర్దుబాటు విధాన వైఖరి ఉపసంహరణను కొనసాగించాలని పరపతి విధాన కమిటీ నిర్ణయించినట్లు శక్తికాంత దాస్ తెలిపారు. ద్రవ్యోల్బణంపై ఎంపీసీ దృష్టి సారించిందని, అయితే ప్రస్తుతం ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్షిత పరిధి అయిన 4 శాతం ఎగువనే ఉందని తెలిపారు. కీలక రేట్లపై నిర్ణయాన్ని తీసుకునేందుకు రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలను ఆర్‌బీఐ పరిగణనలోకి తీసుకుంటుంది. జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం కాస్త పెరిగి 4.81శాతంగా నమోదైంది.

**వృద్ధి రేటు 6.5శాతం..** ఈ ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటును గత అంచనాలను అనుగుణంగా 6.5 శాతం వద్ద స్థిరంగా కొనసాగించాలని ఎంపీసీ నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. వాణిజ్య రంగంలో వనరుల ప్రవాహం గతేడాది రూ.5.7లక్షల కోట్లుగా ఉండగా.. ఈ ఏడాది అది రూ.7.5లక్షల కోట్లకు పెరిగిందని వెల్లడించారు. ద్రవ్యోల్బణం, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సవాళ్లుగా మారుతున్నాయని చెప్పారు. అయినప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ.. ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద ఆర్థికశక్తిగా ఎదిగేందుకు వృద్ధి పథంలోనే పయనిస్తోందని ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు.

**ద్రవ్యోల్బణ అంచనాలు..** టమాటాలు, పప్పుధాన్యాల ధరలు విపరీతరంగా పెరగడంతో ఈ ఏడాది రిటైల్ ద్రవ్యల్బోణ అంచనాలను ఆర్‌బీఐ సవరించింది. గతంలో ఈ అంచనాలు 5.1శాతంగా ఉండ గా.. ఇప్పుడు దాన్ని 5.4శాతానికి పెంచింది. ఈ ఏడాది రెండో త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 6.2శాతం, మూడో త్రైమాసికంలో 5.7శాతం, నాలుగో త్రైమాసికంలో 5.2శాతం ఉండనున్నట్లు అంచనా వేసింది.




దిల్లీ: పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా మణిపుర్ అంశంపై వాడీవేడీ చర్చ జరుగుతోంది. అవిశ్వాస తీర్మానంపై చర్చలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. ఈశాన్య రాష్ట్రంలో ఉద్రిక్తతలను చల్లార్చడానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాగే ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటున్నారని చెప్పారు. 'ఈ దేశం మొత్తానికి నేను ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. ప్రధాని మోదీ మణిపుర్ గురించి అస్సలు ఆలోచించడం లేదని కొందరు విమర్శలు చేస్తున్నారు. మణిపుర్‌లో ఘర్షణల విషయం తెలియగానే మోదీ తెల్లవారుజామున నాలుగింటికి ఒకరోజు ఫోన్ చేశారు. మరుసటి రోజు ఉదయం ఆరున్నరకు ఫోన్ చేశారు. మూడురోజుల పాటు నిమిషం తీరిక లేకుండా మేం పనిచేశాం. 16 వీడియో కాన్ఫరెన్సుల్లో పాల్గొన్నాం. అలాగే 36,000 మంది కేంద్ర బలగాల సిబ్బందిని పంపించాం. వైమానిక దళాన్ని ఉపయోగించాం. ఆ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీని బదిలీ చేశాం. సూరత్ నుంచి ఒక సలహాదారును పంపాం. ఇవన్నీ కేంద్రం మే నాలుగునే చేసింది' అని వెల్లడించారు. మైతేయ్‌లకు ఎస్టీ హోదా విషయంలో ఆందోళనకు గురైన గిరిజన ప్రాంత ప్రజలు చురాచాంద్‌పుర్‌లో నిర్వహించిన సంఘీభావ ర్యాలీ హింసాత్మకంగా మారిన 24 గంటల్లోనే కేంద్రం ఈ చర్యలన్నీ తీసుకుందని అమిత్ షా పేర్కొన్నారు. అలాగే ఆర్టికల్ 356 కింద మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిని అమిత్ షా తోసిపుచ్చారు. 'ఆర్టికల్ 356 ఎందుకు అమలు చేయట్లేదని వారు అడుగుతున్నారు. హింసాత్మక ఘటనల సమయంలో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం సహకరించనప్పుడు మాత్రమే ఈ నిబంధనను అమలు చేస్తారు. ప్రస్తుతం మాకు ఆ సమస్య ఏమీ లేదు' అని అన్నారు. అలాగే ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్‌ను ఎందుకు తొలగించడం లేదని విపక్షాలు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. 'ఆయన కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయనప్పుడు అలాంటి అవసరం ఉంటుంది. మణిపుర్ సీఎం మాకు సహకరిస్తున్నారు' అని తెలిపారు. ఇదిలా ఉంటే.. మణిపుర్‌లో శాంతిస్థాపన నిమిత్తం అమిత్ షా జూన్‌లో నాలుగురోజుల పాటు పర్యటించారు. వివిధ వర్గాలకు చెందిన ప్రజాసంఘాల నేతలతో సమావేశమయ్యారు. కమిటీలను ఏర్పాటు చేశారు. కానీ, ఆ తర్వాత కూడా హింస ఆగలేదు. మరీ ముఖ్యంగా ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన వీడియో వెలుగులోకి వచ్చి తీవ్ర సంచలనం సృష్టించింది.

## స్విమ్మింగ్ ఫూల్ లో అందాల కవ్వింత

2005 సంవత్సరంలో 'మొదటి సినిమా' అనే చిత్రంలో హీరోయిన్ గా నటించి ఇండస్ట్రీకి పరిచయం అయిన ముద్దుగుమ్మ పూనమ్ భజ్వా. ఈ అమ్మడు కెరీర్ ఆరంభంలో వరుసగా ఆఫర్లు దక్కించుకుంది. కానీ ఎక్కువ శాతం నిరాశపరచడంతో తక్కువ కాలానికే తగ్గాయి. ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోత ఫోటోలు ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దాదాపుగా ఇరవై ఏళ్లు అవ్వబోతున్నా కూడా అందాల ఆరబోత విషయంలో ఏమాత్రం తగ్గేదే లేదు అన్నట్లుగా స్కిన్ షో చేస్తోంది. ఆకట్టుకునే అందం తో పాటు ఈ అమ్మడి ఫిజిక్ కు ఎంతటి వారు అయినా ఫిదా అవ్వాల్సిందే అన్నట్లుగా స్కిన్ షో ఉంటుంది. తాజాగా ఇలా స్విమ్మింగ్ సూట్ లో అందాల ఆరబోత చేసి ఆహా అనిపించింది. స్విమ్మింగ్ ఫూల్ లో ఈ అమ్మడి అందాల ఆరబోతకు ఆహా అనకుండా ఉండలేరు అన్నట్లుగా ఈ ఫోటోలు ఉ



న్నాయి అనడంలో సందేహం లేదు. ఈ రేంజ్ అందాల ఆరబోత చేసినా కూడా సినిమా ఆఫర్లు ఈమెకు రావడం లేదు పాపం అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. స్విమ్మింగ్ పూల్ పూల్ పిక్స్ తో వైరల్ అవుతున్న ఈ అమ్మడు ముందు ముందు కచ్చితంగా ఆకట్టుకునే అందాలతో స్కిన్ షో తో మెప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ రేంజ్ అందాల ఆరబోత చేస్తే కచ్చితంగా మళ్లీ ఈమె ఇండస్ట్రీలో బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం సీనియర్ హీరోయిన్స్ కు వెబ్ సిరీస్ లు మంచి అవకాశాలను తెచ్చిపెడుతున్నాయి. కనుక ఈమె కోరుకుంటే వరుసగా వెబ్ సిరీస్ ల్లో ఛాన్స్ లు రావచ్చు అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈమెకు సిరీస్ ల్లో నటించే ఆసక్తి ఉందా అనేది చూడాలి.

## ఐదు ఫ్లాపులు అయినా తగ్గని అమ్మడి క్రేజ్..!

బుట్ట బొమ్మ పూజా హెగ్దేని మళ్లీ బ్యాడ్ లక్ వెంటాడుతుంది. అమ్మడు చేసిన గత ఐదు సినిమాలు నిరాశపరచాయి. అందులో తెలుగు తమిళ సినిమాలు మూడు ఉండగా హిందీ సినిమాలు రెండు ఉన్నాయి. ప్రభాస్ తో రాధే శ్యాం సినిమా భారీ అంచనాలతో వచ్చి ఫ్లాప్ అయ్యింది. ఇక ఆ తర్వాత విజయ్ బీస్ట్ ఆశించిన స్థాయిలో అంచనాలను అందుకోలేదు. ఇక ఆ తర్వాత బాలీవుడ్ లో చేసిన సర్కస్ చరణ్ తో చేసిన ఆచార్య సినిమాలు విఫలమయ్యాయి. ఇక లేటెస్ట్ గా బాలీవుడ్ లో సల్మాన్ తో చేసిన కిసి కా భాయ్ కిసి కి జాన్ సినిమా కూడా అమ్మడికి నిరాశ మిగిల్చింది. బాలీవుడ్ లో హిట్ మేనియా కొనసాగించాలని చూస్తున్న పూజా హెగ్దే కలని కలగానే



మిగిలింది. ఐదు ఫ్లాపులు ఉన్నా సరే అమ్మడి క్రేజ్ మాత్రం ఎక్కడ తగ్గట్లేదని చెప్పొచ్చు. ప్రస్తుతం త్రివిక్రమ్ మహేష్ కాంబో సినిమాలో పూజా నటిస్తుంది. ఇదే కాకుండా మరో స్టార్ హీరో సినిమాలో కూడా పూజా బేబీ ఛాన్స్ అందుకుందట. స్టార్ సినిమాల్లో ఫలితాలతో సంబంధం లేకుండా అమ్మడు ఛాన్స్ లు అందుకుంటుంది. కెరీర్ మొదట్లో కూడా పూజా హెగ్దేకి మొదట ఫ్లాపులే పలకరించాయి. కానీ అల్లు అర్జున్ దువ్వాడ జగన్నాథం సినిమాతో అమ్మడి రేంజ్ మారిపోయింది. అంతకుముందు గ్లామర్ షో విషయంలో ఆలోచించిన పూజా డీజేలో తన గ్లామర్ షోకే ప్రేక్షకులు పడిపోయారన్న రీజన్ తో అమ్మడు వరుస సినిమాల్లో గ్లామర్ షో చేస్తూ వస్తుంది. పూజా థై షోకి సెపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అమ్మడు సినిమాలో ఉంది అంటే తొడల అందాల ప్రదర్శన చాలా కామన్ అనిపించేలా చేసింది. ఆ గ్లామర్ షో వల్లే అమ్మడికి సినిమాల రిజల్ట్ తో తేడా లేకుండా ఛాన్స్ లు వస్తున్నాయి. ఏది ఏమైనా ఒకటి రెండు ఫ్లాపులు పడితేనే అడ్రస్ లేకుండా పోతున్న హీరోయిన్స్ ఉండగా పూజా హెగ్దే మాత్రం హిట్లు వస్తున్నా మళ్లీ అవకాశాలను మాత్రం అందుకుంటూ ఫాం కొనసాగిస్తుంది. మహేష్ 28వ సినిమా హిట్ అయితే అమ్మడు మళ్లీ తిరిగి ఫాం లోకి వచ్చినట్టే.




## కథ కేళీ క్లాస్ దర్శకుడి హర్రర్ చిత్రం




ఈ మధ్యకాలంలో దర్శకులు కొత్త కథలతో విభిన్నంగా ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ఆడియన్స్ టేస్ట్ మారడం. బలమైన కథ, కథనాలు ఉంటేనే సినిమాలు హిట్ చేస్తున్నారు. స్టార్ హీరో చిత్రమైన కంటెంట్ లో దమ్ములేకపోతే డిజాస్టర్ అయిపోతున్నాయి. అందుకే దర్శకులు తమ ఆలోచనలకి పదును పెడుతున్నారు. రెగ్యులర్ ఫార్మాట్ కథలు కాకుండా యూనిక్ గా ఉండే కంటెంట్ లని బయటకి తీసుకొస్తున్నారు. కులుమనాలి చిత్రంతో దర్శకుడిగా మారి తరువాత రామదండు, దొంగలబండి సినిమాలతో హ్యాట్రిక్ ఫ్లాప్ లని అందుకున్న దర్శకుడు సతీష్ వేగేశ్న శతమానం భవతి మూవీతో సక్సెస్ అందుకున్నారు. వెంటనే నితిన్ తో శ్రీనివాస కళ్యాణం మూవీతో మరో డిజాస్టర్ ని ఖాతాలో వేసుకున్నారు. కళ్యాణ్ రామ్ తో ఎంత మంచివాడవరా సినిమాతో మరో డిజాస్టర్ కొట్టారు. అయితే సక్సెస్ కోసం గట్టిగా ట్రై చేస్తోన్న ఈ దర్శకుడు ఇప్పటికే శ్రీహరి కొడుకు హీరోగా కోతికొమ్మచ్చి అనే మూవీ చేశారు. అలాగే ఎన్టీఆర్ బావమరిది నితిన్ హీరోగా శ్రీశ్రీ రాజావారు అనే మూవీ కూడా కంప్లీట్ చేశారు. ఈ రెండు సినిమాలు రిలీజ్ కావాల్సి ఉంది. ఇప్పుడు హర్రర్ జోనర్ మూవీతో ప్రేక్షకుల ముందుకి రావడానికి రెడీ అవుతున్నారు. కథకేళి టైటిల్ తో తెరకెక్కిన ఈ మూవీ టీజర్ తాజాగా రిలీజ్ అయ్యింది. హరీష్ శంకర్ టీజర్ లాంచ్ చేశారు. దిల్ రాజు మూవీ పోస్టర్ ని ఆవిష్కరించారు. ఇషారెబ్బ ఈ మూవీలో లీడ్ రోల్ చేస్తోంది. అలాగే నందిని రాయ్, పూజిత పొన్నాడ, అనన్య నాగళ్ళ లీడ్ రోల్ చేస్తున్నారు. టీజర్ చూస్తుంటే ఓ బంగ్లా నేపథ్యంలో జరిగే కథగానే ఉంది. అలాగే ఒక పుస్తకం, అందులో రాసి ఉన్న సంఘటనలకి ఇంట్లో జరిగే కథకి మధ్య ఏదో తెలియని మిస్టరీ ఉందనే విధంగా టీజర్ ని ఆవిష్కరించారు. కంప్లీట్ హర్రర్ జోనర్ లోనే ఈ మూవీని ఆవిష్కరించినట్లు టీజర్ తో క్లారిటీ వస్తోంది. మరి ఈ చిత్రం సతీష్ వేగేశ్నకి మంచి బూస్ట్ ఇచ్చి ఫామ్ లోకి తీసుకొచ్చి సక్సెస్ ఫుల్ డైరెక్టర్‌గా మారుస్తుందేమో చూడాలి. కథకేళి సిని మాలో హీరోయిన్స్ అందరూ కూడా తెలుగమ్మాయిలే ఉండటం మరో ప్రత్యేకత అని చెప్పాలి. విరూపాక్ష సినిమాతో హర్రర్ జోనర్ కథలకి ఎప్పుడూ డిమాండ్ ఉంటుందని అర్ధమైంది. మరి కథకేళి చిత్రం కూడా అలాంటి విజయాన్ని అందుకుంటుందా అనేది చూడాలి.

## శ్రుతి హాసన్ తాజా పచ్చబొట్టు ఎక్కడ? ఎవరిది? ఎందుకు?






వయసు పెరిగే కొద్దీ మనిషి ఆలోచనల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. ప్రముఖుల్లో అది మరింత కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంటుంది. గ్లామర్ ప్రపంచంలో తళుక్కుమనే తారల మాటల్లోనూ.. చేతల్లోనూ ఇది తప్పనిసరి. ఏళ్లకు ఏళ్లుగా ఇండస్ట్రీలో తన సత్తా చాటుతున్న శ్రుతిహాసన్ తాజాగా మరో పచ్చబొట్టును వేసుకుంది. అయితే.. ఇప్పటివరకు ఆమె వంటి మీద ఉన్న టాటూలకు భిన్నమైనదిగా దీన్ని చెప్పాలి. తాజాగా ఆమె వేసుకున్న పచ్చబొట్టును చూస్తే.. శ్రుతిలో మార్పు కొట్టొచ్చినట్లు కనిపించటమే కాదు.. ఆమెలోని కొత్త కోణాన్ని అందరికి అర్థమయ్యేలా చేసిందని చెప్పాలి. నలభయ్యో పడికిదగ్గర అవుతున్న ఈ ముద్దుగుమ్మ.. స్టైల్ కు.. ఫ్యాషన్ కు ఐకాన్ లా వ్యవహరిస్తుంటారు. రోటీన్ కు ట్రెండ్ కు భిన్నంగా వ్యవహరించే ఆమె.. తాజాగా వేయించుకున్న పచ్చబొట్టు అందరిని ఆకర్షిస్తోంది. ఇప్పటికే ఆమె ఒంటి మీద ఉన్న పచ్చబొట్టులను చూస్తే.. మణికట్టు పైన గులాబీ.. చెవి వెనుక సంగీతాన్ని గుర్తు చేసేలా పచ్చబొట్టు వేయించుకోవటం తెలిసిందే. తాజాగా వేయించుకున్న పచ్చబొట్టు మాత్రంఈ రెండింటికి భిన్నమైనది. అసలు శ్రుతి నుంచి ఏ మాత్రం అంచనా వేయలేనిదిగా చెబుతున్నారు. తాజాగా ఆమె తన ఇష్టదైవం మురుగన్ ఆయుధాన్ని టాటూలా వేయించుకున్నారు. అంతేకాదు..తమిళంలో తన పేరును వేయించుకోవటం గమనార్హం. తాను వేయించుకున్న కొత్త టాటూను ఇన్ స్టాలో షేర్ చేసిన శ్రుతి.. తానెప్పుడూ అధ్యాత్మికత వైపు మొగ్గు చూపుతుంటానని చెప్పారు. తన మనసులో మురుగన్ కు ప్రత్యేకమైన స్థానం ఉందని.. తాజా పచ్చబొట్టుతో తనలోని భక్తిని ప్రదర్శించాలని భావించినట్లుగా చెప్పుకొచ్చారు. మొత్తానికి శ్రుతిలో కొత్త మార్పు కొట్టొచ్చినట్లుగా కనిపించట్లేదు?

## బ్యాక్ అందాలు చూపిస్తూ కవ్విస్తోంది

పంజాబీ, మలయాళం సినిమాలతో పాటు హిందీలో కూడా పలు సినిమాల్లో నటించి మెప్పించిన ముద్దుగుమ్మ వామికా గబ్బి. ఈ అమ్మడు 2015 నుండి ఇండస్ట్రీలో కొనసాగుతోంది. తెలుగు లో ఈ అమ్మడు భలే మంచి రోజు అనే సినిమాలో నటించడం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన విషయం తెల్సిందే. హీరోయిన్ గా తెలుగు లో ఈమె సుధీర్ బాబుకు జోడీగా నటించి మెప్పించింది. అయితే ఆ తర్వాత పెద్దగా ఆఫర్లు దక్కించుకోలేక పోయింది. అయితే సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు ఈ అమ్మడు అందాల ఆరబోత



చేస్తూ కవ్విస్తూనే ఉంది. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోతతో కన్నుల విందు చేసింది. తాజాగా వామికా గబ్బి బ్యాక్ లెస్ డ్రెస్ తో వావ్ అనిపించింది. వీపు అందాన్ని చూపిస్తూ పిచ్చెక్కిస్తున్న ఈ అమ్మడి అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు కూడా ఫిదా అవుతున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈమె సొంతం అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. ఈ రేంజ్ లో అందాల ప్రదర్శన చేస్తున్నా కూడా పాపం ఎందుకు ఈమెను ఇండస్ట్రీ వర్గాల వారు పట్టించుకోవడం లేదు కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బ్యాక్ అందాలతోనే కాకుండా ఎప్పుడు కూడా ఈ అమ్మడు తన క్లీవేజ్ షో తో కూడా ఆకట్టుకుంటూ ఉంది

## మణిరత్నం కథానాయిక అవ్వాలని నటినయ్యా!-అదితీరావ్ హైదరీ

భారతీయ సినిమా అనే పవర్ హౌస్ లో భాగమైనందుకు థ్రిల్లింగ్ గా గర్వంగా ఉందని అందాల కథానాయిక అదితీరావ్ హైదరీ అన్నారు. "నేను మణిరత్నం కథానాయికను కావాలనుకున్నాను. అందుకే ..నటిని అయ్యాను" అని కూడా తెలిపారు. ప్రయోగాలు చేస్తూ భాషతో సంబంధం లేకుండా వైవిధ్యమైన పాత్రలను పోషించేందుకు ఆసక్తిగా ఉంటానని తెలిపారు. "నేను ఎప్పుడూ సినిమాని హిందీ తమిళం అని చూడలేదు. నా దృష్టిలో ఏదైనా అద్భుతమైన దర్శకుల కథనం మాత్రమే. ఎవరైనా నటీనటులు సరైన సమయంలో సరైన స్థలంలో ఉన్నట్లయితే అద్భుతమైన దర్శకుల దృష్టిలో



భాగం అవుతారు. మణి సర్ తో నేను చేసిన సినిమా నా జీవితాన్ని అన్ని విధాలుగా మార్చేసింది" అని చెప్పింది. ఆన్ స్క్రీన్ ఇమేజ్ కి దశలు ఉన్నాయని చెప్పిన అదితీరావ్... పనిని ఎంచుకునే విధానంలో ఒక ప్రక్రియ ఉంటుందని తెలిపింది. ముందుగా దర్శకులను ఎంపిక చేసుకుంటాను. స్క్రిప్ట్ ను నాకు ఆఫర్ చేసిన పాత్రను చూస్తాను. అన్నీ కుదిరితే ఆ పాత్రను ఎంపిక చేసుకుంటాను. నేను ఎంపికల విషయంలో జానర్ లేదా భాషని చూడను. ఎంచుకునే దర్శకుడు.. కథను అనుసరించి దశలవారీగా ముందుకు వెళతామని కొంతవరకూ టైప్ కాస్టింగ్ జరుగుతుందని నేను నమ్ముతున్నాను. దర్శకులు తారల్ని ఒక నిర్దిష్ట మార్గంలో చూస్తారు. ఎక్కువ మంది అలా చూడాలనుకుంటున్నారు లేదా ఎక్కువ మంది దర్శకులు అలా ఉపయోగించుకోవచ్చని భావిస్తాను. ఇది అంత చెడ్డ విషయం అని నేను అనుకోను... అని అదితీ తెలిపారు.




## గ్రూప్-2 వాయిదా వేయాల్సిందే.. టీఎస్‌పీఎస్సీ వద్ద అభ్యర్థుల నిరసన

హైదరాబాద్: గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం ముట్టడికి అభ్యర్థులు యత్నించారు. నాంపల్లిలోని తెజస కార్యాలయం నుంచి సుమారు 2 వేల మంది అభ్యర్థులు పెద్దఎత్తున ర్యాలీగా బయలుదేరి వచ్చారు. అభ్యర్థుల నినాదాలతో టీఎస్‌పీఎస్సీ కార్యాలయ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు కోదండరామ్, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్.. గ్రూప్–2 అభ్యర్థుల నిరసనకు మద్దతు తెలిపారు. ర్యాలీగా వస్తున్న అభ్యర్థుల్లో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అభ్యర్థుల నిరసన నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ కార్యాలయ పరిసరాల్లో భారీగా పోలీసులు మోహరించారు. కమిషన్ కార్యాలయం సమీపంలో అభ్యర్థులు బైఠాయించి ధర్నా చేపట్టారు. పరీక్షలను వాయిదా వేయాలని బోర్డు కార్యదర్శి అనిత రామచంద్రన్‌కు కాంగ్రెస్ నేతలు అద్దంకి దయాకర్, డాక్టర్ రియాజ్, తదితరులు వినతి పత్రం అందజేశారు.

**నెలలో రెండు పరీక్షలు..!** గ్రూప్ –2 పరీక్షకు ఆగస్టు 29, 30 తేదీలను ఖరారు చేశారని.. కానీ ఆగస్టు 1 నుంచి 23 వరకు గురుకుల బోర్డుకు సంబంధించిన పరీక్ష తేదీలు ఉన్నాయని అభ్యర్థులు తెలిపారు. ఒకే నెలలో గ్రూప్ – 2, గురుకుల పరీక్షల నిర్వహణ, సిలబస్‌లూ వేర్వేరుగా ఉండటంతో.. ఏదో ఒక పరీక్షకు మాత్రమే సన్నద్ధం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంతో తమకు అర్హతలు ఉన్నప్పటికీ అవకాశాన్ని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గ్రూప్ – 2 పరీక్షలోని మూడో పేపర్ (ఎకానమీ)లో గతంలోని సిలబస్‌కు అదనంగా 70 శాతం కలిపారని పేర్కొన్నారు. పేపర్ లీకేజీ ఘటనతో మూడు నెలలు మానసిక ఆవేదనతో సరిగా చదవలేకపోయామన్నారు.

ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని గ్రూప్ – 2 పరీక్షను మూడు నెలలు వాయిదా వేయాలని కోరారు. మానవతా దృక్పథంతో తమ సమస్యను అర్థం చేసుకుని.. వెసులుబాటు కల్పించాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**అభ్యర్థులకు తగిన సమయం ఇవ్వాలి: కోదండరాం –** గ్రూప్ 2 పరీక్షలను వాయిదా వేయాలని తెజస అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ కోరారు. అభ్యర్థులతో కలిసి నిరసనల్లో పాల్గొన్న ఆయన.. ప్రస్తుతం జేఎల్, గ్రూప్ 2 పరీక్షలు వరుసగా ఉన్నాయన్నారు.

దీనిని దృష్టిలో పెట్టుకొని పరీక్షలకు చదువుకునేందుకు అభ్యర్థులకు తగిన సమయం ఇవ్వాలని కోరారు. ఏడేళ్లు ఆగిన ప్రభుత్వం.. పరీక్షకు మరో మూడు నెలలు ఆగలేదా?అని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ప్రశ్నించారు. తూతూమంత్రంగా పరీక్షలు నిర్వహిస్తున్నారని.. అభ్యర్థుల ఆవేదనను ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. అరెస్టు చేసిన అభ్యర్థులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## మెట్రో రైల్ విస్తరణపై మంత్రి కేటీఆర్ సమీక్ష

హైదరాబాద్: నగరవాసులకు ప్రజారవాణాను మరింత చేరువచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా కాలుష్యరహిత మెట్రో విస్తరణకు పూనుకున్నది. ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టూ మెట్రో లైన్ నిర్మిస్తామని, ఇప్పటికే ఉన్న మార్గాలను పొడిగిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా హైదరాబాద్ చుట్టూ, నగరంలోని వివిధ ప్రాంతాల్లో మెట్రో రైలు విస్తరణ ప్లాన్‌పై మంత్రి కేటీఆర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. బేగంపేటలోని హైదరబాద్ రైల్ భవన్‌లో జరిగిన ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, జీహెచ్‌సీఎం పరిధిలోని జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మెట్రో విస్తరణపై అధికారులతో చర్చించారు. కాగా, నగరం నలువైపులా రూ.60 వేల కోట్లతో మెట్రోను విస్తరించాలని మంత్రి మండలి నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు 31 కిలోమీటర్ల మేర విస్తరించనున్న మెట్రోకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. టెండర్ ప్రక్రియ కూడా తుదిదశకు చేరుకున్నది. దీనితోపాటు జూబ్లీ బస్టాండ్ నుంచి తూంకుంట వరకు డబుల్ డెక్కర్ మెట్రో (ఒక లెవల్‌లో వాహనాలు, మరో లెవల్‌లో మెట్రో) ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. ప్యాట్నీ నుంచి కండ్లకోయ ఓఆర్ఆర్ వరకు మరో రూట్‌లో (ఆదిలాబాద్ –నాగపూర్ రూట్‌లో) డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మించాలని నిర్ణయించింది. దీనికి సంబందించి రక్షణశాఖకు సంబంధించిన కంటోన్మెంట్ భూములు కొన్ని ఉన్నాయి. హైదరాబాద్‌లో అతిముఖ్యమైన మరో మార్గం ఇస్నాపూర్ నుంచి మియాపూర్ వరకు, మియాపూర్ నుంచి లక్డీకపూల్ వరకు, విజయవాడ దారిలో ఎల్బీనగర్ నుంచి పెద్దఅంబర్‌పేట వరకు, వరంగల్ రూట్‌లో ఉప్పల్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ వరకు మెట్రోను విస్తరింపజేయనుంది. మహబూబ్‌నగర్ రూట్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌వైపు నిర్మిస్తున్న మెట్రోను భవిష్యత్తులో కొత్తూరు మీదుగా షాద్‌నగర్ వరకు, తార్నాక నుంచి ఈసీఐఎల్ క్రాస్‌రోడ్ వరకు విస్తరించనున్నారు. ఇక పాతబస్తీ మెట్రోను కూడా సమగ్రంగా విస్తరించనున్నారు. ఓఆర్ఆర్ ఉన్న 159 కిలోమీటర్లు చుట్టూ మెట్రోను విస్తరించబోతున్నారు. అదేవిధంగా ఎయిర్‌పోర్టు నుంచి ఫార్మాసిటీ అందుబాటులోకి రాబోతున్న కందుకూరు వరకు మెట్రోను నిర్మించనున్నారు. దీనికి సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే ప్రభుత్వానికి అందజేయాలని మెట్రోరైల్ అథారిటీ, మున్సిపల్ శాఖను సీఎం కేసీఆర్ ఆదేశించిన విషయం తెలిసిందే.

## వీఆర్ఏలు ఇకపై పేస్కేల్ ఉద్యోగులు : మంత్రి ఎర్రబెల్లి



జనగామ : వీఆర్ఏలు ఇకపై పేస్కేల్ ఉద్యోగులు. రాష్ట్రవ్యాప్తంగా 20,555 మంది వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. జిల్లాలోని వీఆర్ఏల రెగ్యులరైజేషన్‌తో పాటు, వారిని వివిధ శాఖలకు కేటాయించిన ఆర్డర్స్ ను ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, జడ్పీ చైర్మన్ సంపత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శివలింగయ్యతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలో 314 మందికి ప్రభుత్వ ఉత్తర్వులు పంపిణీ చేస్తామన్నారు. భూస్వామ్య వ్యవస్థకు ప్రతిరూపంగా కొనసాగుతున్న వీఆర్ఏ వ్యవస్థను రద్దుచేసి, వేలాది కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించడం ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయమని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో APPSC ద్వారా కేవలం నెలకు 3 వేల రూపాయలతో కన్ సాలిడేటెడ్ వేతనంతో నియమించబడిన వీఆర్ఏల క్రమబద్ధీకరణ దేశ చరిత్రలో నిలిచిపోతుంది. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా ఇలా గొప్ప నిర్ణయాలు తీసుకోలేదు. గ్రామంలో ఏ ఇతర శాఖ అధికారి వచ్చినా వీఆర్ఏలు అందుబాటులో ఉండేవారు. గత కొన్ని సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో ఇబ్బదులు పడ్డారని గుర్తు చేశారు. మీరు ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పనిచేయాలని సూచించారు. గృహలక్ష్మి మైనారిటీలకు లక్ష రుణ సాయం బీసీ నిరుపేదలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం, రుణ మాఫీ వంటి అనేక పథకాలను అమలు చేస్తుండటంతో ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్ అవుతున్నది. కేసీఆర్ తన అమ్ముల పొది లోంచి ఒక్కో ఆయుధాన్ని తీసి వదులుతుంటే ప్రతిపక్షాలకు షాక్ తగులుతుంది. వారి ఆశలు అడియాస రావడం ఖాయమన్నారు. ప్రతిపక్ష నేతలు ఆత్మ విమర్శ లేకుండా, విమర్శలు చేస్తున్నారు. అలాంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్లు రోహిత్ సింగ్, సుహాసిని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పేద పిల్లలకు విద్యను అందించేందుకే మన ఊరు- మన బడి : మంత్రి కొప్పుల



పెద్దపల్లి : గ్రామాల్లోని నిరుపేద పిల్లలకు విద్యను అందించడం కోసమే మన ఊరు– మన బడి కార్యక్రమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లాలోని ధర్మారం మండల నందిమేడారం నల్లలింగయ్య పల్లెలో ప్రాథమిక పాఠశాలలో మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా 13 లక్షల 6 వేల నిధులతో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..జిల్లాలో మొదటి విడతలో 274 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో మన ఊరు– మన బడి కింద 91 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ విద్యావ్యవస్థలో రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా మంచి ఫలితాలు సాధించారని, పూర్తిస్థాయిలో విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకు వచ్చే దిశగా మన ఊరు– మన బడి కార్యక్రమాన్ని సీఎం రూపొందించారు. మన ఊరు మనడి కార్యక్రమంతో రాష్ట్రంలో సర్కారు బడుల రూపురేఖలు మారిపోనున్నాయని పేర్కొన్నారు.

## జీహెచ్ఎంసీ పరిధిలో ఆరు విడతల్లో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు

హైదరాబాద్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించడం లేదంటూ భాజపా నేత ఎన్.ఇంద్రసేనారెడ్డి 2021లో దాఖలు చేసిన పిల్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా రెండు పడకగదుల ఇళ్ల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదిక సమర్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా 1,43,544 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపింది. ఇప్పటి వరకు 65,538 ఇళ్లు లబ్ధిదారులకు కేటాయించామని, జీహెచ్ఎంసీ పరిధిలో 65,458 ఇళ్లను దశలవారీగా కేటాయిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. జీహెచ్ఎంసీ పరిధిలో సెప్టెంబరు మొదటి వారం నాటికి 12,275 ఇళ్లు కేటాయిస్తామని పేర్కొంది. ఆరు విడతల్లో జీహెచ్ఎంసీ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయిస్తామని, నవంబరు మొదటి వారం నాటికి ఇళ్లన్నీ లబ్ధిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేసింది.



ఇళ్ల నిర్మాణం పురోగతిపై నివేదిక సమర్పించేందుకు మరికొంత సమయం ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. దీంతో పిల్‌పై విచారణను హైకోర్టు మూడు వారాలకు వాయిదా వేసింది.

## పేదలకు న్యాయం జరిగేలా బాధ్యతగా పని చేయాలి : మంత్రి గంగుల

కరీంనగర్ : పేదలకు న్యాయం జరిగేలా బాధ్యతగా వీఆర్ఏలు పనిచేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో 442 మంది విఆర్ఏలకు వివిధ శాఖల యందు ప్రభుత్వ ఉద్యోగులుగా నియామక ఉత్తర్వుల పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్హతల ఆధారంగా వివిధ శాఖలకు కేటాయించిన గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఏ) పేదలకు న్యాయం జరిగేలా బాధ్యతయుతంగా విధులను నిర్వర్తించాలని సూచించారు. నిన్నటి వరకు జిల్లాలోని గ్రామాల్లో గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్ఏ) గా విధులు నిర్వహించిన 442 మంది విఆర్ఏ లను ప్రభుత్వ పేస్కేల్ ఉద్యోగులు నియమిస్తూ సీఎం కేసీఆర్ చారిత్మాత్మక నిర్ణయం తీసుకొని వీఆర్ఏల గౌరవం పెంచారన్నారు.

అలాగే పంచాయతీకార్యదర్శులుగా 4 సంవత్సరాల సర్వీసు కాలం పూర్తిచేసుకున్న వారికి క్రమబద్ధీకరణ ఉత్తర్వులను అందజేశారు. కష్టపడి పనిచేసే వారికి అవకాశాలు వాటంతట అవే వస్తాయని,



గతంలో ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసి అంకిత భావంతో పనిచేసిన వీఆర్ఏలు అదే తరహాలో కేటాయించిన శాఖలలో విధులు నిర్వహించాలని కోరారు. కష్టపడి పనిచేసి భవిష్యత్తులో పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు.

## ఆ సభకు రాలేదని నన్ను అడుగుతున్నారు.. మరి కవిత ఎందుకు రాలేదు?

ఢిల్లీ : దమ్ముంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో.. సీఎం కేసీఆర్ నిజామాబాద్ నుంచి పోటీ చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ సవాల్ చేశారు. నేడు ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ నిజామాబాద్?లో మోసపూరిత వాగ్దానాలు చేశారన్నారు. ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయో చూపిస్తానన్నారు. కేసీఆర్ కొడుకు అనేది మాత్రమే కేటీఆర్ అర్హత అని ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. మిషన్ కాకతీయ బడ్జెట్ అంతా కవితకు అప్పజెప్పారన్నారు. నిన్న కేటీఆర్ సభకు రాలేదని తనను అడుగుతున్నారని.. మరి కవిత ఎందుకు రాలేదని ప్రశ్నించారు. విప్ ఉండటంతో నిన్నటి కేటీఆర్ సభకు వెళ్ళలేదని ఎంపీ అర్వింద్ వెల్లడించారు.



## ఒక్క సంతకంతో వారి కన్నీళ్లకు చెక్ పెట్టిన సీఎం కేసీఆర్ : మంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్ : భూస్వామ్య వ్యవస్థకు చిహ్నాలుగా మిగిలిన వీఆర్ఏలను ముఖ్యమంత్రి కేసీఆర్ పేస్కేల్ ఉద్యోగులుగా మార్చారని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న16,758 మంది వీఆర్ఏల ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తూ తెలంగాణ సర్కారు జీవో నంబర్ 81ను జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లాలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో వీఆర్ఏలకు ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి అందజేసి మాట్లాడారు. సామాన్యుల కష్టం తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. ఒక్క సంతకంతో ఈ రోజు వేలది వీఆర్ఏల ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని ప్రశంసించారు. సమైక్య పాలనలో వీఆర్ఏలను తలారులుగానే పిలిచారు తప్ప, వారి కష్టాలకు తగిన గుర్తింపు ఇవ్వలేదు. కనీసం గౌరవ వేతనం ఇవ్వాలని ఎంత ప్రాధేయపడ్డా కనికరం చూపలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బానోత్ శకర్ నాయక్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, జిల్లా కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ డేవిడ్, జడ్పీ సీఈవో రమాదేవి, పంచాయతీ శాఖ అధికారి నర్మద, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఓపెన్ రిగ్గింగ్‌కు మోదీ సర్కార్ కుట్ర : రెడ్కో చైర్మన్ వై సతీష్ రెడ్డి

హైదరాబాద్ : కేంద్రంలోని బీజేపీ సర్కారు రాబోయే ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఓపెన్ రిగ్గింగ్‌కు ప్రయత్నాలు చేస్తోందని తెలంగాణ రెడ్కో చైర్మన్ వై సతీష్ రెడ్డి ఆరోపించారు. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన కేంద్ర ఎన్నికల కమిషన్‌ను నరేంద్ర మోదీ సర్కారు పూర్తిగా తమ జేబు సంస్థగా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల నియామక విధివిధానాలకు సంబంధించిన బిల్లులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేరు లేకపోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న తాత్కాలిక కమిటీలో భారత ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉన్నారని.. కానీ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లులో మాత్రం.. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా ప్రస్తావన లేకుండా కేంద్రమంత్రి ఉంటారని చెప్పడం.. ఎన్నికల వ్యవస్థను కబ్జా పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నమేనని దుయ్యబట్టారు. ముగ్గురు సభ్యుల కమిటీలో ఇద్దరు ప్రభుత్వంలోని వ్యక్తులే ఉంటే.. తమకు అనుయాయులైన వాళ్లను చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా, స్టేట్ ఎలక్షన్ కమిషనర్లుగా నియమించుకునే అవకాశం ఉందన్నారు. వాళ్ల మనుషులే అధికారులుగా ఉంటే.. రిగ్గింగ్ చేసినా, ఈవీఎంలలో డేటా మార్చినా, చివరకు ఫలితాలను తారుమారు చేసి ప్రకటించినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. తద్వారా నరేంద్రమోదీ శాశ్వతంగా ప్రధానమంత్రిగా ఉండాలని, బీజేపీనే అధికారంలో ఉండేలా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గతంలో సుప్రీంకోర్టు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం స్వతంత్ర్యంగా పని చేయాలంటే ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకం కోసం ఏర్పాటు చేసే కమిటీలో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా కూడా ఉండాలనే విషయాన్ని కూడా సుప్రీంకోర్టు గతంలో చెప్పిందన్నారు. ఇప్పటికే స్వతంత్రంగా పనిచేయాల్సి సీబీఐ, ఈడీ, ఐటీ వంటి విచారణ సంస్థలు.. కేంద్రంలోని మోడీ సర్కారు పెంపుడు జంతువులుగా మారిపోయాయనే అపవాదును మూటగట్టుకున్నాయని సతీష్ రెడ్డి తెలిపారు.

## మీరు జయలలితను అవమానించిన విషయం మర్చిపోయినట్లున్నారు : నిర్మలా సీతారామన్

దిల్లీ : పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారు. మణిపుర్‌లో మహిళలపై జరుగుతున్న హింసను ప్రస్తావించిన డీఎంకే సభ్యులపై ఆమె విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి జయలలితకు నిండు సభలో అవమానం జరిగిన విషయాన్ని కేంద్రమంత్రి ప్రస్తావించారు. తొలుత డీఎంకే ఎంపీ కనిమొళి సభలో మాట్లాడుతూ దేశంలో మహిళలపై నేరాలు పెరిగిపోతున్నాయని అన్నారు. దీనిపై స్పందించిన నిర్మలా సీతారామన్ 'మణిపుర్, రాజస్థాన్, దిల్లీతో సహా ఎక్కడ మహిళలకు అన్యాయం జరిగినా దాన్ని తీవ్రంగా పరిగణించాలి. రాజకీయాలు చేయకూడదు. ప్రతిపక్ష నాయకురాలిగా ఉన్న మహిళను గతంలో డీఎంకే సభ్యులు అసెంబ్లీలోనే అవమానించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన తరువాతనే మళ్లీ సభలో అడుగు పెడతానని ఆనాడు జయలలిత శపథం చేశారు. రెండేళ్ల తర్వాత ఆమె ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలో అడుగుపెట్టారని' 1989 మార్చి 25న తమిళనాడు అసెంబ్లీలో జయలలితకు జరిగిన అవమానాన్ని గుర్తు చేశారు. దాంతో డీఎంకే ఎంపీలు నిరసనకు దిగారు. వెంటనే స్పందించిన కేంద్రమంత్రి 'మీరు కౌరవ సభ, ద్రౌపది గురించి మాట్లాడుతున్నారు. కానీ, డీఎంకే జయలలితను మర్చిపోయిందా? నమ్మబుద్ధి కావట్లేదని' అన్నారు. కేంద్ర ప్రభుత్వం బలవంతంగా హిందీని రాష్ట్రాలపై రుద్దుతోందని కనిమొళి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. నరేంద్రమోదీ ప్రభుత్వం 'సిలప్పదికారం' స్ఫూర్తిని అమలు చేస్తోందని చెప్పారు. సెంగోల్‌ను న్యాయానికి చిహ్నంగా కొత్త పార్లమెంటులో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ దాన్ని ఇన్నాళ్లూ మర్చిపోయి మ్యూజియంలో పెట్టడం తమిళులను అవమానించినట్లు కాదా అని ప్రశ్నించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com